ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శనివారం 25 జనవరి 2025





130 కి.మీ 6 గంటలు

- మాచర్ల రైలు ప్రయాణం మహానరకం
- సమయం పొడిగింపుతో పరిస్థితి మరీ అధ్వానం
- అడుగడుగునా హోల్టింగులతో ప్రయాణికులకు ఇక్కట్లు

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 130 కిలోమీటర్ల దూరం.. మహా అయితే రెండు నుంచి మూడు గంటల ప్రయాణం ఉంటుంది. కానీ మాచర్ల రైలు ఎక్కితే అంత దూరం ప్రయాణానికి ఐదు నుంచి ఆరు గంటలు పడుతుంది. సౌకర్యవంతంగా.. నాణ్యమైన సేవలతో ప్రయాణికుల నుంచి ఆదరణ పొందాల్సిన రైల్వే అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ఇందుకు మాచర్ల రైలు ప్రయాణమే ఉదాహరణగా నిలుస్తోంది. మాచర్ల, రెంటచింతల, గురజాల, పిడుగురాళ్ల నుంచి గుంటూరు, విజయవాడ వెళ్లే రైలు ప్రయాణికులకు రైల్వే అధికారులు నరకం చూపిస్తున్నారు. మాచర్లలో బయలుదేరిన రైలు గుంటూరుకు ఎప్పుడు చేరుతుందో.. అసలు గమ్యం చేరుతుందో లేదో.. అన్నంతగా ప్రయాణికులను భయపెడుతోంది. పల్నాడు జిల్లా మాచర్లలో సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరే 57204 నెంబరు రైలు 130 కి.మీ దూరంలో ఉన్న గుంటూరుకు రాత్రి 8 గంటలకల్లా చేరాలి. 130 కి.మీ దూరానికి మూడున్నర గంటల సమయం పట్టడమే అన్యాయం అనుకుంటే ఆ రైలు పొరపాటున కూడా ఆ సమయానికి రాదు. పైపెచ్చు ప్రతి రోజూ మరో రెండు గంటలు ఆలస్యంగా, అంటే 5, 6 గంటల సమయం తీసుకుని రాత్రి 9:30, 10 గంటలకుగానీ గుంటూరు జంక్షన్ చేరదు. గురువారం రాత్రి కూడా 10 గంటలకుగానీ రైలు గుంటూరు చేరలేదు. గుంటూరు, మాచర్ల మధ్య కేవలం రెండు రైళ్ల మాత్రమే ఉండడంతో ఆ మార్గంలో ప్రయాణించే సామాన్య ప్రజలంతా ఆ రెండు రైళ్లపైనే ఆధారపడతారు. కరోనా పేరుతో ఇప్పటికే సగం స్టేషన్లు ఎత్తేయడంతో సగం మంది పల్నాడు పల్లె ప్రజలకు రైలు ప్రయాణం దూరమైంది. అయినా ఈ రైలు నిత్యం వేలాది మందితో రద్దీగా ఉంటుంది. అలాంటి రైలును గంటల కొద్దీ జాప్యంగా నడపడంతో ప్రయాణికులు, ప్రత్యేకించి మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాచర్లలో మధ్యాహ్నం 4:30 గంటలకు బయలుదేరాల్సిన రైలు ఇటీవల సాయంత్రం ఐదున్నర, ఆరు గంటల వరకూ బయలుదేరడమే లేదు. రైల్వే అధికారులు ఎందుకు అలా చేస్తున్నారో ప్రయాణికులకు అర్థం కావడం లేదు. తీరా బయలుదేరాక నడికుడి జంక్షన్లో అరగంట నుంచి గంట సేపు నిలిపేస్తున్నారు. ఇక అక్కడి నుంచి సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌లు, గూడ్స్ రైళ్ల కోసం ఈ రైలును స్టేషన్ స్టేషన్‌కు అరగంట చొప్పున ఆపేస్తున్నారు. దీంతో రెండు గంటల ప్రయాణానికి 5, 6 గంటలు పడుతోంది.

● ఉద్యోగులకూ తిప్పలు..

మాచర్ల నుంచి గుంటూరు వచ్చి గుంటూరు నుంచి మరో నెంబరు 57202 పేరుతో విజయవాడ వెళ్లే ఈ రైలుపై ఉద్యోగులు ఎక్కువగా ఆధారపడుతుంటారు. గుంటూరు నుంచి రాత్రి 8:10కి బయలుదేరే ఈ రైలు కొంత కాలంగా రాత్రి 10 గంటల వరకూ బయలుదేరడం లేదు. దీంతో ఉద్యోగులు, మహిళలు రైలుపై ఆధారపడడం మానేశారు. వారంతా ఇప్పుడు బస్సులపై ఆధార పడుతున్నారు. రైలు సమయాన్ని ఒక్క అర గంట పాటు ముందుకు జరిపితే వేలాదిమంది ప్రయాణికులకు మేలు చేసినవారవుతారని రైల్వే అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా వారు సానుకూలంగా స్పందించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. పైపెచ్చు గతంలో రాత్రి 7:45కు గుంటూరు చేరాల్సిన ఈ రైలు సమయాన్ని రాత్రి 8 గంటలకు పొడిగించారు. దీంతో ప్రయాణికులు రైల్వే అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పేదింటికి.. చేయూత



సొంతిల్లు.. అందరి కల. పేదలకు గృహయోగం సాకారం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని పథకాలు తీసుకొచ్చినా ఆశించిన ఫలితాలు రావడంలేదు. ఆయా పథకాలను సద్వి నియోగం చేసుకునేందుకు పెద్దగా పేదలు ముందుకు వచ్చే వారు కాదు. కొందరు ఇళ్లు పొందినా వాటిలో ఉండలేక చాలామంది అమ్ముకోవడం జరుగుతుంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం 2015లో అమల్లోకి తెచ్చిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎం ఏవై)లో భారీ మార్పులు తెచ్చింది. పీఎంఏవై-2.0 పేరుతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. సమాజంలోని అన్ని వర్గాల వారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందేలా మార్పులు చేసింది. ఈ పథకంతో రెట్టింపు సాయం అందించి పేదల గృహయోగానికి చేయూతగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది.

రెట్టింపు సాయంతో గృహయోగం

- పీఎంఏవై 2.0పై ప్రభుత్వం కసరత్తు
- మూడు రూపాల్లో పథకం విస్తరణ.. రాయితీలు
- అన్ని వర్గాల వారికి లబ్ధి చేకూరేలా పథకం రూపకల్పన

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తోంది. సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన వారు కూడా సొంత ఇంటిలో నివాసం ఉండేలా కార్యాచరణ సిద్ధం చేసింది. గతంలో ఎన్నో పథకాలు ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదని తెలుసుకున్న కేంద్ర ప్రభుత్వం భారీ మార్పులతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0కు శ్రీకారం చుట్టింది. పేదలకు మరింత చేయూత అందిస్తూ.. నిర్మాణానికి రెట్టింపు సాయం అందించేలా పథకంలో భారీ మార్పులు చేసింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉండే ఆర్థికంగా అట్టడుగు వర్గాలు, ఆర్థికంగా బలహీనమైన వారు, తక్కువ, మధ్య ఆదాయ సమూహాలుగా ఈ పథకాన్ని విస్తరించింది. తద్వారా సమాజంలోని అన్ని వర్గాలవారికి ఆర్థిక చేయూతను అందించేలా పీఎంఏవై 2.0 ఉండనున్నది. 2024 చివరిలో పీఎంఏవై 2.0కు శ్రీకారం చుట్టగా మెజారిటీ పేదలకు గృహ యోగం లభించనున్నది. కేంద్ర ప్రభుత్వం 2015లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై)కి శ్రీకారం చుట్టింది. సొంత ఇల్లు కట్టుకోవాలనుకునే పేదలకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం చేయూత అందించింది. ఈ పథకంలో భాగంగా పీఎం ఏవై (అర్బన్) కింద అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణ పేదలకు (మిగతా 7వ పేజీలో)

నాలుగు రకాలుగా..

- **బీపీఎల్ :** దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, ఆర్థికంగా అట్టడుగు వర్గాలు.
- **ఈడబ్ల్యూఎస్ :** ఆర్థికంగా బలహీనమైన విభాగం.
- **ఎల్ఐజీ :** తక్కువ ఆదాయ సమూహం.
- **ఎంఐజీ :** మధ్య ఆదాయ సమూహం

తక్కువ ధరల్లో అద్దె ఇళ్లు(ఏఆర్‌హెచ్)

ఇప్పటి వరకు సొంత ఇళ్లకు మాత్రమే పరిమితమైన ఈ పథకం పట్టణంలో ఉండే నిలువ నీడలేని వలస కూలీల కోసం తక్కువ ధరలో అద్దె ఇళ్లు అందించే ప్రయత్నం చేస్తోంది. శ్రామిక మహిళలు, పారిశ్రామిక కార్మికులు, నిరాశ్రయులు, విద్యార్థులు ఇతర లబ్ధిదారులకు అందుబాటులో ఉండే ప్రభుత్వ భవనాల్లోని ఖాళీ ప్లాట్లను తక్కువ అద్దెకు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. వాటిని స్వల్ప కాలిక ప్రాతిపదికన అందించాలని భావి స్తోంది. ఇది ఆచరణలో సాధ్యం కాకపోవచ్చుని, అనేక సాంకేతిక సమస్యలు తలెత్తుతాయని అధికారులు భావిస్తున్నారు.



మార్చి నెలాఖరుకు.. 1500 ఇళ్లు పూర్తి

- గృహ నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యం
- ఎన్టీఆర్ కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తాం
- గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

నరసరావుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలాఖరుకు నరసరావుపేటలోని ఎన్టీఆర్ కాలనీలో 1500 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. నరసరావుపేటలోని పీఎంఏవై-ఎన్టీఆర్ కాలనీలో శుక్రవారం లబ్ధిదారులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నదని చెప్పారు. చేపట్టిన గృహ నిర్మాణ లక్ష్యాలను 2026 నాటికి పూర్తి చేస్తామన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తామన్నారు. రానున్న ఐదేళ్లలో పేదలందరికీ గృహ వసతి కల్పించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేదల సొంత ఇంటి కల నెరవేర్చేలా పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారన్నారు. కాలనీలో వెనువెంటనే మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ దీపాలను 7 రోజుల్లో ఏర్పాటు చేస్తామని, రహదారులు, తాగునీటి వసతి కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీకి ఆర్చిని ఏర్పాటు చేస్తామని, ప్రధాన రహదారిని రెండు నెలల్లో నిర్మిస్తామని చెప్పారు. కాలనీలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహించేలా పోలీసులు చర్యలు తీసుకుంటారన్నారు. కాలనీలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయి.. ఎంత మంది పిల్లలు ఉన్నారనేది అధ్యయనం చేసి పాఠశాల, ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న రోజుల్లో మెప్మా ద్వారా లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయిస్తామన్నారు. 2014-2019లో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.5 లక్షలు ఇవ్వగా గత ప్రభుత్వం కేవలం రూ.30 వేలు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఆర్డీవో మాధులత, గృహ నిర్మాణ శాఖ అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే అరవిందబాబు



కోటప్పకొండ త్రికోటేశ్వరుడి సన్నిధిలో మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

జీడీసీసీబీ రేసులో.. ఆ ఇద్దరు



కుర్రా అప్పారావు



మక్కెన మల్లికార్జునరావు

- చైర్మన్ పదవి కోసం **పోటాపోటీ**
- సిఫార్సు లేఖలతో రంగంలో మక్కెన మల్లికార్జునరావు, కుర్రా అప్పారావు
- అత్యధిక మంది ప్రజాప్రతినిధుల మద్దతుతో అప్పారావు
- వైసీపీని వీడి టీడీపీలో చేరడం మల్లికార్జునరావుకి మైనస్

గుంటూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోనే కీలకమైన గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (జీడీసీసీబీ) చైర్మన్‌పదవి కోసం టీడీపీలో ఇద్దరు నేతలు పోటీ పడుతున్నారు. వీరిలో ఒకరు వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మరొకరు టీడీపీ సీనియర్ నేత కుర్రా అప్పారావు. మక్కెన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులుతో పాటు వైసీపీని వీడి ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. అంతకు ముందు ఆయన వైసీపీలో కొనసాగుతూ 2019 ఎన్నికల్లో వినుకొండ వైసీపీ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు విజయానికి సహకరించారు. ఆ తర్వాత బొల్లాతో విభేదించి పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. అయితే అప్పటికే వైసీపీ ఎంపీగా కొనసాగుతున్న శ్రీకృష్ణదేవరాయలుతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ వచ్చారు. ఆయనతో ఉన్న సాన్నిహిత్యం మూలంగానే 2024 ఎన్నికల నాటికి టీడీపీలో చేరి వినుకొండలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విజయానికి కృషి చేశారు. దీంతో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవికి మక్కెన పేరును సిఫార్సు చేస్తూ ఎమ్మెల్యే ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కూడా మక్కెనకు ఇవ్వాలని కోరుతూ లేఖలు ఇచ్చారు. ఇక చైర్మన్ పదవి ని ఆశిస్తున్న చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన కుర్రా అప్పారావు రేసులో ముందంజలో ఉన్నారు. చైర్మన్ పదవి పొందేందుకు ఏదో ఒక సొసైటీ నుంచి అధ్యక్షుడిగా గెలుపొందాల్సి ఉండటంతో తన సొంత మండలమైన యడ్లపాడులోని మర్రిపాలెం గ్రామాన్ని అప్పారావు ఎంచుకుని గ్రౌండ్ సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుతం ఆ సొసైటీ నుంచి ఆయన తండ్రి కుర్రా రత్తయ్య సొసైటీ అధ్యక్షుడుగా ఉన్నారు. రత్తయ్య జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్‌గా చాలా కాలం పనిచేశారు. అప్పారావు గతం లో రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శిగా పనిచేశారు. తొలి నుంచి టీడీపీకి ఆయన కుటుంబం అంకితమై పనిచేస్తున్నది. గతంలో మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య విజయానికి, ఆ తర్వాత మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విజయంలో అప్పారావు కుటుంబం కీలకంగా వ్యవహరించింది. అలాగే ఇటీవల ఎన్నికల్లో సొంత నియోజకవర్గమైన చిలకలూరిపేటలో పుల్లారావు గెలుపునకు, పెదకూరపాడు నుంచి పోటీ చేసిన తన చిన్ననాటి మిత్రుడు భాష్యం ప్రవీణ్ గెలుపులోనూ అప్పారావు ప్రధాన పాత్ర పోషించారు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి బరిలోకి దిగిన పలువురు ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి హార్థిక, ఆర్థిక సహకారం కూడా తన వంతుగా అందించారు. దీంతో అప్పారావు ఆశిస్తున్న చైర్మన్ పదవికి తొలి నుంచి పార్టీలో ఉన్న వారెవరూ కూడా పోటీకి రాలేదు. అంతేకాకుండా అప్పారావుకు పదవి ఇవ్వాలని కోరుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఇద్దరు ఎంపీలు, సీనియర్ ఎమ్మెల్యేలందరూ సిఫార్సు లేఖలు ఇచ్చారు. సీనియర్ మోస్ట్ ఎమ్మెల్యేలైన ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, కన్నా లక్ష్మీనారాయణలు సైతం అప్పారావును బలపరిచారు. అలాగే గుంటూరు జిల్లా (మిగతా 7వ పేజీలో)





ఫైర్‌సేఫ్టీ.. రూ.10 వేలు

- కోల్డ్‌స్టోరేజ్ లైసెన్సుల పునరుద్ధరణలో మామూళ్ల దందా

గుంటూరు సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 'గత ఏడాది జనవరి 19న రాత్రి దుగ్గిరాలలో శుభం మల్లీశ్వరి కోల్డ్‌స్టోరేజ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో లక్షా 15 వేల బస్తాల పసుపు అగ్నికి ఆహుతి కాగా ఆరు జిల్లాల రైతులు రూ.కోట్లలో నష్టపోయారు. ఇంతవరకు చాలా మందికి సరైన పరిహారం అందిన దాఖలాలు లేవు.. దుగ్గిరాల అగ్ని ప్రమాదం అనుభవాన్ని దృష్టిలో పెట్టుకున్న అధికారులు కోల్డ్ స్టోరేజ్ లైసెన్సుల రెన్యువల్ ప్రక్రియను కొంత జఠిలం చేశారు. ఫైర్ సేఫ్టీ(అగ్ని భద్రత)కి సంబంధించిన నిబంధనలు పాటి స్తేనే లైసెన్సు పునరుద్ధరణ జరుగుతుందని స్పష్టం చేశారు. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కోల్డ్‌స్టోరేజ్‌లు చాలా వరకు 20 ఏళ్ల క్రితం నిర్మించినవే. నూతన ఫైర్‌సేఫ్టీ విధానం వాటికి ఎంతవరకు వర్తిస్తుందన్న దానిపై సందిగ్ధత నెలకొంది. ఈ విషయంలో అటు అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేస్తుంది. ఇంతలోనే గుంటూరు యార్డు పరిధిలో 34, ప్రత్తిపాడు యార్డు పరిధిలో 70 కోల్డ్‌స్టోరేజ్‌లకు లైసెన్సు రెన్యువల్ ప్రక్రియను అధికారులు తెరపైకి తెచ్చారు. ఒక్క రోజులోనే అన్ని లైసెన్సులు రెన్యువల్ కావాలంటూ అధికా రులు హడావుడి చేస్తున్నారు. 2014-2019 వరకు కోల్డ్‌స్టోరేజ్‌ల ఫైర్‌సేఫ్టీని పరిశీలించి, నిరభ్యంతర సర్టిఫికెట్ ఇచ్చే అధికారం జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులకు ఉండేది. జగన్ ప్రభుత్వంలో ఆ బాధ్యతను రాష్ట్ర అధికారులకు అప్పగించింది. ఫలితంగా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని స్టోరేజ్‌లకు కూడా నిరభ్యంతర సర్టిఫికెట్లు వచ్చాయి. అందుకోసం రాష్ట్ర అధికారులు జిల్లాకు ఒక బ్రోకర్‌ని ఏర్పాటు చేసి నగదు వసూలు చేశారన్నది బహిరంగ రహస్యం. ఈ క్రమంలో తాజాగా ఒక్కో స్టోరేజ్ వద్ద తక్కువలో తక్కువ రూ.10 వేలు తీసుకున్నాక రెన్యువల్ ప్రక్రియ మొదలుపెట్టినట్లు సమాచారం. సీజన్ ఆరంభానికి ముందు లైసెన్సు పునరుద్ధరణ జరగాలంటే అడిగినంత ఇవ్వాల్సిందేనని కోల్డ్ స్టోరేజీ నిర్వాహకులకు అధికారులు సందేశం పంపారు. ఇటీవల కూడా కొన్ని స్టోరేజ్‌ల వద్ద ఇదేవిధంగా తీసుకున్నట్లు తెలిసింది. ఒక ట్రేడర్‌ను వెంటపెట్టుకుని వెళ్లి మరీ ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలుస్తోంది. కొందరు అధికారులు ఈ విషయంలో దూకుడుగా ఉన్నట్లు తెలిసింది.

అగ్గి రాచుకుంటే బుగ్గే

భవన నియమ నిబంధనలు ప్రకారం 15 మీటర్ల కన్నా ఎక్కువ(మూడు అంతస్థులు) ఎత్తున నిర్మాణం జరిగితే ఖచ్చితంగా ఫైర్‌సేఫ్టీ ఉండాలి. బిల్డింగ్ చుట్టూ అగ్నిమాపక వాహనం తిరిగేలా ఖాళీ వదలాలి. అగ్నిమాపక వాహనం లోపలికి వెళ్లడానికి తగినంత స్థలం వదిలి నిర్మాణాలు చేపట్టాలి. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని చాలా కోల్డ్‌స్టోరేజ్‌ల్లో ఆ ఏర్పాటు లేదు. చాలా కోల్డ్‌స్టోరేజ్‌లు ఇరుకుగా ఉండే స్థలాల్లో నిర్మించారు. పొరపాటున అగ్గి రాచుకుంటే లోపలికి ఫైర్ ఇంజన్ వెళ్లే అవకాశం కూడా చాలా తక్కువగా ఉంది. ఇంతటి ప్రమాదకర పరిస్థితులు కళ్లకు కనిపిస్తున్నా అధికారులు ఏదో ఒక సాకు చెప్పి లైసెన్సు రెన్యువల్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

అఫిడవిట్ ఎంతవరకు..

కోల్డ్‌స్టోరేజ్‌ల లైసెన్సులను పునరుద్ధరించేందుకు యజమానుల వద్ద అఫిడవిట్ తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ప్రమాదం జరిగి రూ.కోట్ల సరుకు అగ్నికి ఆహుతి అయితే అది రైతు ప్రయోజనాలను ఎంత వరకు పరిరక్షిస్తుందన్నది అంతుపట్టని ప్రశ్న. కోల్డ్‌స్టోరేజ్ లైసెన్సు రెన్యువల్ కోసం యజమానులు ఇస్తున్న అఫిడవిట్‌కు ఏవిధమైన చట్టబద్ధత లేదని కొందరు అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. ప్రస్తుతం లైసెన్సుల పునరుద్ధరణ కోసం కొన్ని కోల్డ్ స్టోరేజ్‌ల యజమానులు సరైన ఇన్సూరెన్స్ చేయకుండానే చేసినట్లు అఫిడవిట్‌లో చూపుతున్నారు. పాత ఇన్సూరెన్స్ పత్రాలను కూడా చూపించి తప్పుదారి పట్టిస్తున్నారని కొందరు సిబ్బంది గుర్తించారు. అటువంటి లైసెన్సులను రెన్యువల్ చేస్తే భవిష్యత్‌లో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పది మంది డీటీలకు ఉద్యోగోన్నతి

- రెండు మండలాల తహసీల్దార్ల బదిలీ
- 12 మందికి మండలాలు కేటాయింపు

నరసరావుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పది మంది డీటీలకు తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. వీరికి మండలాలను కేటాయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. పెదకూరపాడు, అమరావతి తహసీల్దార్లను బదిలీ చేశారు. డానియేలును పెదకూరపాడు నుంచి అమరావతికి, నాగమల్లేశ్వరరావును అమరావతి నుంచి మాచవరానికి మార్చారు. ఇక డీటీ వీ వెంకటనాగరాజుకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ వర్కింగ్ అరేంజ్‌మెంట్ కింద క్రోసూరు తహసీల్దారుగా నియమించారు. బండి నిర్మలను రొంపిచర్లకు, నీలి ధనలక్ష్మి పెదకూరపాడుకు, దొప్పలపూడి మేరి కనకం కలెక్టరేట్‌కు, ఆర్ వెంకటేశ్వర్లునాయక్ బొల్లాపల్లికి, అందె నళిని ఈపూరుకు, మూడావత్ అర్జున్ నాయక్ రెంటచింతలకు, ఎస్ సరోజ సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయ ఏవోగా, వైవీబీ కుటుంబరావు గురజాలకు, ఎం రాజులను దాచేపల్లి తహసీల్దార్‌గా నియమించారు.



సచివాలయ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జీఏడీ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా

ప్రజాస్వామ్యానికి మూల స్తంభం ఓటు: ఎంకే మీనా

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి మూల స్తంభం ఓటు అని రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి (పొలిటికల్) ముఖేశ్ కుమార్ మీనా అన్నారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన ఉద్యోగులతో ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ పౌరులుగా, ఓటరుగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. గత ఎన్నికల్లో దేశంలోనే అత్యధికంగా రాష్ట్రంలో ఓటింగ్ శాతం 80కిపైగా నమోదు చేసి రికార్డు సృష్టించాం. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ ఓటర్లను, ఓటు హక్కు వినియోగ ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే వారినీ ప్రత్యేకంగా సత్కరించుకుంటున్నాం' అని మీనా పేర్కొన్నారు.

గణతంత్ర వేడుకలకు గిరిజన అతిథిగా గురునాథం

న్యూఢిల్లీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర వేడుకలకు ప్రత్యేక గిరిజన అతిథిగా హాజరుకావాలని టీడీపీ నాయకుడు, మాదిగాని గురునాథంకు కేంద్రప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. గణతంత్ర వేడుకలకు హాజరుకావడానికి ఢిల్లీ చేరుకున్న ఆయన శుక్రవారం ప్రధాని మోదీని ఆయన నివాసంలో ఇతర గిరిజన అతిథులతో పాటు కలిశారు.

'విత్తన ధ్రువీకరణ' ఉన్నతాధికారులపై ఏసీబీకి ఫిర్యాదు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా లాంలోని రాష్ట్ర విత్తన ధ్రువీకరణ అథారిటీలోని ఇద్దరు ఉన్నతాధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదులు వెళ్లాయి. వీరు ఆదాయాన్ని మించి భారీగా ఆస్తులు కూడగట్టారని పలువురు ఏసీబీకి లేఖ రాసినట్లు తెలిసింది. విత్తన ధ్రువీకరణ అధికారులుగా పనిచేస్తున్న ముగ్గురికి పదోన్నతులు కల్పించినందుకు రూ.లక్షల్లో ముడుపులు పుచ్చుకున్నారని సమాచారం. 'విత్తన క్షేత్రాలు, విత్తన నాణ్యత, విత్తన, పరిశోధన ఫలితాల విషయంలో నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారు. ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు, కొత్త సిబ్బంది నియామకాల్లో ముడుపులు తీసుకుంటున్నారు. వాహనాల కొనుగోలు, కార్యాలయ నిర్వహణ వ్యయంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దీనిపై కౌంటర్ వేయకుండా, ముడుపులు పుచ్చుకుని, కొనసాగిస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది 25మందిలో ఐదుగురిని పర్మినెంట్ చేసే ప్రయత్నాలు చేయగా, బోర్డు మీటింగ్‌లో బెడిసికొట్టింది. సంస్థ వాహనాన్ని హైదరాబాద్‌లో కీలక అధికారి కుటుంబ సభ్యులు వాడుతుంటే, ఏపీలో ఉపయోగిస్తున్నట్లు లాగ్‌బుక్‌లో రాస్తున్నారు. మరో ఉన్నతాధికారి తాత్కాలిక ఉద్యోగిగా చేరి అంచెలంచెలుగా ఎదిగి, ఉద్యోగాన్ని అడ్డం పెట్టుకుని, అక్రమాలకు పాల్పడుతున్నారు' అని ఏసీబీ డైరెక్టర్‌తోపాటు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

'ఫెర్రో'కు తగ్గించిన విద్యుత్ సుంకం కొనసాగింపు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ నుంచి యూనిట్‌కు ఆరు పైసలు చొప్పున వసూలు చేస్తున్న విద్యుత్ సుంకాన్ని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వు జారీ చేసింది. గతంలో యూనిట్‌కు 10 పైసలు చొప్పున వసూలు చేస్తున్న సుంకాన్ని ఆరు పైసలకు తగ్గించారు. ఆ తగ్గింపు సుంకాన్నే మరో ఏడాది కొనసాగించాలన్న ఫెర్రో ఎల్లాయిస్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ పరిశ్రమపై 30,000 మంది ఉద్యోగులు వారి కుటుంబాలూ ఆధారపడి ఉన్నాయని ఉత్తర్వులో పేర్కొన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొనే ఈ నిర్ణయం తీసుకున్నామని ఉత్తర్వులో వివరించారు.

గణతంత్ర వేడుకలకు ముస్తాబైన సచివాలయ భవనాలు





గాడిలో గ్రామీణాభివృద్ధిశాఖ!

సంస్కరణల బాట పట్టించాలని నిర్ణయం

- పంచాయతీరాజ్ తరహాలో ప్రక్షాళన చేసే యోచన
- ఉద్యోగుల పదోన్నతులు, జీతాల వ్యత్యాసాలపై దృష్టి
- వేతనాలు పెంచేందుకు పక్కాగా మార్గదర్శకాలు
- ఎప్పటికప్పుడు సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు
- ఉపముఖ్యమంత్రి ఆదేశాలతో కసరత్తు ప్రారంభించిన అధికారులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పంచాయతీరాజ్‌శాఖలో ప్రక్షాళన ప్రారంభించిన ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిశాఖలోనూ సంస్కరణలు తీసుకురావాలని యోచిస్తోంది. తొలుత ఉద్యోగుల పదోన్నతులు, జీతాల వ్యత్యాసాలపై దృష్టి పెట్టాలని భావిస్తున్నారు. వేతనాలు పెంచేందుకు మార్గదర్శకాలు పక్కాగా రూపొందించాలని నిర్ణయించారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో గ్రామీణాభివృద్ధిశాఖను అస్తవ్యస్తం చేశారు. ప్రధానమైన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేశారు. వాటర్‌షెడ్ లాంటి పథకాల నిధులు ఏమయ్యాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నింటినీ గాడిలో పెట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. సమస్యల పుట్టగా ఉన్న గ్రామీణాభివృద్ధిశాఖను కచ్చితంగా సంస్కరించాల్సిన అవసరముందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఆయన ఆదేశాలతో ఇప్పటికే కమిషనర్ కృష్ణతేజ ఉన్నతాధికారులతో సంప్రదించి గ్రామీణాభివృద్ధి శాఖలో సమస్యలపై ఒక కమిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఉన్నతస్థాయిలో దానిపై ప్రస్తావన జరిగినట్లు సమాచారం.



పెరగని జీతాలు, దక్కని పదోన్నతులు..

గ్రామీణాభివృద్ధిశాఖలో పథకాలన్నీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందితోనే అమలు చేస్తున్నారు. అధికారులను డిప్యుటేషన్ ద్వారా తీసుకున్నారు. కేంద్ర పథకాలైన ఉపాధి, వాటర్‌షెడ్ తదితర వాటిల్లో రాష్ట్రంలో సుమారు 3 వేల మందికి పైగా మండల, జిల్లా స్థాయి సిబ్బంది ఏళ్ల తరబడి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి లోకేశ్ హయాంలో పెంచిన జీతాలు తప్ప గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వారికి జీతాలు పెంచలేదు. నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలోనూ ఉద్యోగాలు భారంగానే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. 2016-17లో అప్పటి కమిషనర్ రామాంజనేయులు ఉపాధి సిబ్బందికి పదోన్నతుల ప్రక్రియ చేపట్టారు. ఆ తర్వాత ఆ ఊసే లేదు. గత టీడీపీ ప్రభుత్వం ఆఖరులో ఉపాధి సిబ్బందికి హెల్త్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నా.. ఆ తర్వాత వైసీపీ సర్కార్ దానిని పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో స్థానిక నేతల ఒత్తిడితో ఉపాధి హామీ పథకంలో జరిగిన అడ్డగోలు బదిలీలతో సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక గత ప్రభుత్వంలో చేసిన పనులకు సంబంధించి ఇప్పుడు సోషల్ ఆడిట్ నిర్వహిస్తుంటే దొంగలెక్కలన్నీ బయటపడుతున్నాయి. అప్పట్లో పనులు లేకుండా మస్టర్లు వేసినందుకు ఇప్పుడు రూ.లక్షలు రికవరీలు వస్తున్నాయి. కొన్ని చోట్ల సిబ్బందిపై కేసులు కూడా నమోదు చేస్తున్నారు. లేని పనులకు అప్పట్లో ఒత్తిడి చేసి మస్టర్లు వేయించారని, ఇప్పుడు తమను కాపాడేవారు లేరని సిబ్బంది వాపోతున్నారు.

సంస్కరణలు చేపడితేనే పథకం ముందుకు..

గ్రామీణాభివృద్ధిశాఖలో సమూల సంస్కరణలు చేపడితేనే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా సాగుతాయని ఆ శాఖ ఉన్నతాధికారుల్లో చర్చ జరిగింది. ఈ సందర్భంగా వారు మరిన్ని అంశాలను ప్రస్తావించినట్లు తెలిసింది. "ఒక నిర్దిష్ట విధానంలో నియామకాలు చేపట్టడంతో పాటు బదిలీలకు కూడా కొత్త మార్గదర్శకాలు రూపొందించాలి. బదిలీల్లో వీలైనంత వరకు రాజకీయ జోక్యం లేకుండా చేయాలి. ఏటా జీతాలు పెంచడంతో పాటు పీఆర్సీకి అనుగుణంగా వేతనాలు మార్చాలి. సోషల్ ఆడిట్‌కు సంబంధించి సిబ్బందిని జవాబుదారీ చేయడంలో మరిన్ని మార్పులు తీసుకురావాలి. ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలోనూ మార్పులు చేయాలి. సిబ్బంది అర్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలి. ఒకే తరహా ఉద్యోగుల్లో ఉన్న వేతనాల వ్యత్యాసాన్ని సరిచేయాలి. సిబ్బందికి ఆరోగ్య భద్రత కల్పించాలి. రిటైర్మెంట్ వయసును 62కు పెంచాలి. గ్రాట్యుటీ లాంటి ఇతర ప్రయోజనాలను అందించాలి. సిబ్బందికి మెరుగైన శిక్షణ ఇవ్వడం ద్వారా పనులు నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తవుతాయి" అని వారు పేర్కొన్నారు.



గణతంత్ర ఏర్పాట్లు.. బైక్‌లపై ఫీట్లు

గణతంత్ర వేడుకల నిర్వహణకు వాల్తేరు రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. వేడుకలకు నగరంలోని రైల్వే ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు (ఆర్పీఎఫ్) ముమ్మర సాధన చేస్తోంది. దీనిలో భాగంగా శుక్రవారం ద్విచక్ర వాహనాలపై ఆర్పీఎఫ్ సిబ్బంది విన్యాసాలు చేశారు.

-విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఆలయ పాలకవర్గాల నియామకంపై కసరత్తు

- టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులతో పల్లా టెలీ కాన్ఫరెన్స్

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాలకు పాలకమండళ్ల నియామకంపై టీడీపీ కసరత్తు చేపట్టింది. అర్హతలకు అనుగుణంగా ఈ మండళ్లలో ధర్మకర్తల నియామకానికి ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం సాయంత్రం ఈమేరకు ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కలిపి సుమారు 500 ఆలయాలకు పాలక మండళ్లను నియమించాల్సి ఉంది. వీటి భర్తీకి దేవదాయ శాఖ కొన్ని అర్హతలు నిర్దేశించింది. టెలీ కాన్ఫరెన్స్‌లో ఈ అర్హతలను అన్నింటిని పల్లా శ్రీనివాసరావు చదివి వినిపించారు. వీటిని దృష్టిలో ఉంచుకొని ఒకటి రెండు రోజుల్లో తమ ప్రతిపాదనలను పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపాలని ఆయన వారిని కోరారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల పాలక వర్గాలకు ఇంకా కొన్ని నియోజకవర్గాల నుంచి ప్రతిపాదనలు అందకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆ నియోజకవర్గాల జాబితాను ఆయన చదివి వినిపించారు. ఇవి సుమారుగా 50 వరకూ ఉన్నాయి. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థలకు పాలక వర్గాల నియామకంపై కూడా ఇన్‌చార్జి మంత్రులతో ఎమ్మెల్యేలు చర్చించాలని, ఆలస్యం చేయవద్దని ఆయన వారికి సూచించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

వేసవికి విడుదల



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'జాట్'. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్ నిర్మాతలు. ఈ చిత్రం ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ మేరకు నిర్మాతలు రిలీజ్ డేట్ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో సన్నీ డియోల్ ఇంటెన్స్ యాక్షన్-ప్యాక్డ్ అవతార్‌లో కనిపించారు. భుజంపై రాకెట్ లాంచర్‌తో ఆగ్రహంగా ముందుకు అడుగులేస్తున్న సన్నీ డియోల్ లుక్ అదిరిపోయింది. మొత్తానికి పోస్టర్‌లో ఈ చిత్రంలో రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామీ ఖేర్, రెజీనా కాసాండ్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలోని యాక్షన్ సన్నివేశాలు, కొరియోగ్రఫీ ప్రేక్షకులను కట్టిపడేస్తాయని నిర్మాతలు తెలిపారు.

బాలయ్య సరసన సంయుక్త



నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ ప్రతిష్ఠాత్మక చిత్రం 'అఖండ 2.. తాండవం'. ఈ సినిమాలో కథానాయికగా సంయుక్త మీనన్‌ను ఎంపిక చేసినట్లు నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట చెప్పారు. హీరోయిన్లను అద్భుతమైన పాత్రల్లో చూపించే బోయపాటి శ్రీను సంయుక్త కోసం ఓ కీలక పాత్ర సిద్ధం చేశారు. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. ఈ సినిమాకు ఎస్. థమన్ సంగీత దర్శకుడు. సి.రామ్ ప్రసాద్ ఛాయాగ్రాహకుడు. ఈ ఏడాది సెప్టెంబర్ 25న విజయదశమి సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

దోమకొండ కోటలో ప్రియాంక చోప్రా



కామారెడ్డి జిల్లాలోని దోమకొండ గడికోటలో శుక్రవారం ప్రముఖ నటి ప్రియాంక చోప్రా సందడి చేశారు. తెల్లవారుజామున 2 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఆమె గడి కోటలో ఉన్నారు. ఈ సందర్భంగా అక్కడి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కోట తరఫున సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేశారు. కోట సీనియర్ మేనేజర్ బాబ్జి హీరోయిన్‌కు జ్ఞాపికను అందజేశారు. అద్దాల బంగ్లా, సొరంగ మార్గం, చుట్టూ కందకం, కోట చరిత్రను వివరించారు. ప్రియాంక చోప్రా గతంలో రాంచరణ్‌తో 'జంజీర్' సినిమాలో నటించారు. ఆయన శ్రీమతి ఉపాసన ఈ కోటకు వారసురాలు అనే విషయం తెలిసిందే. ప్రియాంక చోప్రా దోమకొండకు వచ్చిందన్న విషయం తెలుసుకున్న స్థానికులు ఉదయమే కోట వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఆమెను చూసేందుకు ఎగబడ్డారు.

దోమకొండ (ఆంధ్రజ్యోతి)

యశ్ చిత్రంలో నయనతార



యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతా మోహన్ దాస్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'టాక్సిక్'. ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రాజెక్టు మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు నటీనటుల గురించి ప్రకటించలేదు. కానీ బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ ఇందులో నటిస్తున్నాడంటూ మేకర్స్ ఆ మధ్య ఓ పోస్టర్ వదిలారు. మరోవైపు 'టాక్సిక్' హీరోయిన్ ఈమె నంటూ సోషల్ మీడియాలో ఎంతో మంది కథానాయికల పేర్లు చక్కర్లు కొట్టాయి. అయితే ఈ ప్రాజెక్టులో నయనతార భాగమైనట్లు బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ప్రస్తుతం తాను యశ్ సినిమా షూటింగ్‌లో ఉన్నానని, దీనిలో నయనతార కూడా నటిస్తున్నారని, ఇంతకు మించి నేనేమీ చెప్పలేనని, పూర్తి సమాచారాన్ని డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ ప్రకటిస్తారని అక్షయ్ ఒబెరాయ్ చెప్పారు. అయితే నయనతార ఏ పాత్రలో కనిపించనున్నారనే దానిపై ఆయన స్పష్టతనివ్వలేదు. కాగా ఈ చిత్రంలో బాలీవుడ్ కథానాయిక కియారా అద్వాణీ ప్రత్యేక గీతంలో నర్తించనున్నారని సమాచారం.

లాస్ ఏంజెలెస్‌లో షూట్ చేస్తాం



'ఫాస్ట్ ఎక్స్ 2' చిత్రం మిగిలిన షూటింగ్‌ను లాస్ ఏంజెలెస్‌లో జరపనున్నట్లు హాలీవుడ్ హీరో విన్‌డీజిల్ ప్రకటించారు. లాస్ ఏంజెలెస్‌లోని పలు ప్రాంతాలను కార్చిచ్చు దహించివేసిన నేపథ్యంలో ఆ నగరం కోసం తనవంతుగా ఏదైనా చేయాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా తెలిపారు. 'ఇప్పుడు లాస్ ఏంజెలెస్‌కు మన అవసరం మరింత ఉంది. 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' ఫ్రాంచైజీలో తొలి చిత్రం షూటింగ్ 25 ఏళ్ల క్రితం ఇక్కడే మొదలైంది. మళ్లీ ఇప్పుడు ఆ నగరంలో 'ఫాస్ట్ ఎక్స్ 2' సినిమా షూటింగ్ చేయబోతున్నందుకు ఆనందంగా ఉంది. నటి జోర్డానా సూచనతో ఈ నిర్ణయం తీసుకున్నాను. లాస్ ఏంజెలెస్‌లో పరిస్థితులు కుదుటపడ్డాక చిత్రీకరణ ప్రారంభిస్తాం' అని తెలిపారు. ఈ ఫ్రాంచైజీలో వస్తున్న చివరి చిత్రం ఇదే. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. లూయిస్ లెటెర్రీర్ దర్శకత్వం వహిస్తున్నారు.

నాన్న మాటే నా జీవన మంత్రం

\- షబానా



'సినిమా దర్శకులకు స్వేచ్ఛ ఉండాలి, అదే సమయంలో సామాజిక బాధ్యత కూడా చాలా ముఖ్యం' అని బాలీవుడ్ నటి షబానా ఆజ్మీ వ్యాఖ్యానించారు. అలా అని ప్రతి సినిమా సందేశాత్మకంగా ఉండాలి అన్న వాదన కూడా సరికాదన్నారు. చలనచిత్రానికి వినోద విలువలు కూడా అవసరం అన్నారు. షబానా ఆజ్మీ సినీ స్వర్ణోత్సవం సందర్భంగా హైదరాబాద్ సాహిత్య మహోత్సవం వేదికగా 'ఎ లైఫ్ ఇన్ సినిమా - షబానా ఆజ్మీ' అంశంపై అమితా దేశాయ్ ఆధ్వర్యంలో చర్చాగోష్ఠి జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... హైదరాబాద్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఇక్కడే పుట్టి, తొమ్మిదో ఏట వరకు ఉన్న తాను తర్వాత కాలంలోనూ వేసవి సెలవులకు నగరానికి వస్తుండేదాన్నని చెప్పారు. సమాజంలో మార్పు కోసం పనిచేస్తున్న క్రమంలో నిరాశ చెందకుండా, నిబద్ధతతో ముందుకెళ్లడాన్నే తాను విశ్వసిస్తానని షబానా చెప్పారు. మార్పు ఒక్క రోజులో వచ్చేది కాదు, కనుక మనం చేసే పని ఇప్పటికిప్పుడు ఫలితాలను ఇవ్వలేకపోవచ్చు. కానీ రేపటినాడు జరిగే మార్పునకు దోహదపడుతుందని తన తండ్రి కైఫీ ఆజ్మీ చెప్పిన మాటలే తనకు జీవిత సూత్రమని, వాటినే ఆచరిస్తూ ముందుకు సాగుతున్నానని షబానా ఆజ్మీ తెలిపారు.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

ఇక వెంకటలచ్చిమి అని పిలుస్తారేమో!

పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న చిత్రం 'వెంకటలచ్చిమి'. ముని దర్శకత్వంలో రాజా, ఎస్ఎస్ చౌదరి నిర్మించనున్న ఈ సినిమా శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ముని మాట్లాడుతూ 'కథ అనుకున్నప్పుడే పాయల్ రాజ్‌పుత్ సరిపోతారనిపించింది. పాన్ ఇండియా సినిమాగా తెలుగుతో పాటు హిందీ, పంజాబీ భాషల్లో తెరకెక్కిస్తున్నాం. ఈ రివెంజ్ డ్రామా భారతీయ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించడం ఖాయం' అని అన్నారు. హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ "మంగళవారం' సినిమా తర్వాత ఎన్నో కథలు విన్నాను. నచ్చక తిరస్కరించాను. ఈ సినిమా తర్వాత నా పేరు వెంకటలచ్చిమిగా స్థిరపడిపోతుందేమో అన్నంతగా బలమైన సబ్జెక్టు ఇది' అని అన్నారు.



అలా ఎందుకు చేశారో చెప్పండి?

● యార్డు కార్యదర్శికి మార్కెటింగ్ డైరెక్టర్ ఆదేశం

● మంత్రి లేఖ బట్టబయలుపై మెమో జారీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి లేఖను బట్టబయలు చేసిన వ్యవహారంలో రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ స్పందించారు. ఈ నెల 21న 'ఆంధ్రజ్యోతి'లో 'మంత్రి లేఖ బట్టబయలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన మార్కెటింగ్ డైరెక్టర్ ఎం.విజయ సునీత బాధ్యులపై చర్యలు చేపట్టారు. అధికారిక లేఖను వెల్లడి చేసిన గుంటూరు మిర్చి యార్డు ఇన్‌చార్జ్ కార్యదర్శి వినుకొండ ఆంజనేయులకు శుక్రవారం మెమో జారీ చేశారు. అధికారిక ఉత్తర, ప్రత్యుత్తరాల దశలో ఉన్న లేఖను ఎందుకు బయట పెట్టారో మూడు రోజుల్లో సమాధానం చెప్పాలని ఆదేశించారు. అధికారిక లేఖను బట్టబయలు చేయటం ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ రూల్స్-1964కు విరుద్ధం అని మెమోలో పేర్కొన్నారు. మెమోకు 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని జత పరిచారు.

కుక్కల కు.ని కేంద్రంలో తనిఖీ

● డంపింగ్ యార్డు వద్ద శస్త్రచికిత్సలు చేయటంపై విచారణ


కుక్కల కు. ని కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జాతీయ జంతు కల్యాణ మండలి బృందం

గుంటూరు సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పరిధిలోని ఏటుకూరు రోడ్డులో ఉన్న కుక్కల కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల కేంద్రాన్ని జాతీయ జంతు కల్యాణ మండలి బృందం శుక్రవారం తనిఖీ చేసింది. ఈ బృందం లో డాక్టర్ ముఖేష్ గుప్తాతో పాటు మరికొందరు సెంట్రల్ టీమ్ సభ్యులు ఉన్నారు. డంపింగ్ యార్డు వద్ద కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు జరుగుతున్నాయని గతంలో తనిఖీకి వచ్చిన కేంద్ర బృందం గుర్తించింది. యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమం ఆ ప్రదేశంలో నిర్వహించటం వల్ల కుక్కల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగే కేంద్రాన్ని వెంటనే మార్చాలని నగర పాలక సంస్థకు సూచించారు. ఈ నేపథ్యంలో నగర పాలక సంస్థ జాతీయ జంతు కల్యాణ మండలి వద్దకు అప్పీల్‌కు వెళ్లింది. యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమం అదే ప్రదేశంలో నిర్వహిస్తామని, అయితే తగిన జాగ్రత్తలు తీసుకుంటామని విజ్ఞప్తి చేశారు. నగర పాలక సంస్థ అప్పీల్ నేపథ్యంలో కేంద్ర బృందం మరోసారి పరిశీలనకు వచ్చింది. కుటుంబ నియంత్రణ జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌ను తనిఖీ చేశారు. తనిఖీల్లో కేంద్ర బృందంతో పాటు జిల్లా పశుసంవర్ధక శాఖకు చెందిన ఏడీఏలు డాక్టర్ మోహన్ రావు, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ చక్రవర్తి, జంతు సంరక్షణ సమితి సభ్యుడు జాగు సురేష్, జాగు నరసింహారావు పాల్గొన్నారు.


గవర్నర్ తేనేటి విందుకు జాజికి ఆహ్వానం


కొమెర జాజి

కారంపూడి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 26వ తేదీన రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తేనేటి విందుకు కారంపూడికి చెందిన పర్యావరణవేత్త కొమెర అంకారావు (జాజి)కి ఆహ్వానం అందింది. గతేడాది గణతంత్ర దినోత్సవం రోజున గవర్నర్ తేనేటి విందుకు కూడా జాజికి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా జాజిని మండల ప్రజలు అభినందించారు.

రూ.6 వేల పింఛన్ ప్రభుత్వ ఘనతే

● మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి


గరల్స్ హాస్టల్‌లో వసతులను పరిశీలిస్తున్న మంత్రి డోలా

బాపట్ల రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని సోషల్ వెల్ఫేర్, డిజేబుల్ అండ్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్, సచివాలయం అండ్ విలేజ్ వలంటరీ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం బాపట్ల మండలం వెదుళ్ళపల్లి పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలిస్తూ గరల్స్ హాస్టల్ లో డస్ట్‌బిన్స్ లేవనీ, వాటిని త్వరగా ఏర్పాటు చేయాలనీ, కిటికీలకు దోమల మెష్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలు, కావాల్సిన మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

బధిరుల ఖాతాకే పింఛన్ జమ

అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ బధిరుల పింఛన్ నేరుగా వారి అకౌంట్‌లకే జమ చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారనీ, దీనిని పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్నారు. బధిరుల ఆశ్రమ పాఠశాలలోని పాతకాలపు భవనాలకు త్వరలోనే మరమ్మతులు చేపడతామన్నారు. దివ్యాంగుల పట్ల సమాజంలో గౌరవం కలగాలనేది ప్రభుత్వ సంకల్పమనీ, దీనిలో భాగంగా విశాఖపట్నంలో 25 ఎకరాలలో రూ. 200 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో పారా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థులకు మంచాలు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ డోనేట్ చేస్తామనడం అభినందనీయం అన్నారు. బాపట్ల శాసన సభ్యుడు వేగేశన నరేంద్రవర్మ, బావుడా చైర్మన్ సలగల రాజశేఖరబాబు, కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దావోస్ పర్యటనపై విమర్శలు సిగ్గుచేటు

దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏమి తెచ్చారని కొందరు మాజీ మంత్రులు విమర్శించడం సిగ్గుచేటని, కేవలం వాళ్ల ఉనికిని చాటుకునేందుకు మాట్లాడుతున్నారని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు.

వీరయ్య చౌదరి ఆశయాలను కొనసాగిస్తాం


స్మృతి వనం వద్ద వీరయ్య చౌదరికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, కుటుంబ సభ్యులు

పొన్నూరుటౌన్, చేబ్రోలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దివంగత ధూళిపాళ్ల వీరయ్య చౌదరి తమకు ఇచ్చిన ఆశయాలను కొనసాగిస్తానని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం పొన్నూరు - చేబ్రోలు మండలాల్లో మాజీ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి 31వ వర్ధంతి, మరో మాజీ మంత్రి పరిటాల రవి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో వీరయ్య చౌదరి స్మృతి వనం వద్ద కుటుంబ సభ్యులు, నరేంద్ర కుమార్ కుమార్ జ్యోతిర్మయి దంపతులతో పాటు వీరయ్య చౌదరి సతీమణి ప్రమీలాదేవి నివాళులర్పించారు. అనంతరం చింతలపూడి గ్రామంలోని వీరయ్య చౌదరి, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే నిడుబ్రోలులో జాగర్లమూడి సుధీర్ ఆధ్వర్యంలో మాజీ మంత్రులు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ పాల్గొని నివాళులర్పించారు. మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు పఠాన్ ఫైరోజ్ ఖాన్ ఆధ్వర్యంలో కూరగాయల వర్తక సంఘం నాయకులు ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పేదలకు అన్నదానం చేశారు. చేబ్రోలు మండలం నారాకోడూరులోని వీరయ్య చౌదరి స్మృతి వద్ద ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. నారాకోడూరు సెంటర్లో డీవీసీ, పరిటాల రవి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ప్రారంభించారు. కాకాని వెంకటరత్నం, పశుదాణ కారాగారం డీవీసీ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్లో డీవీసీ వర్ధంతి ఘనంగా జరిగింది. వడ్లమూడి గ్రామంలో డీవీసీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హాస్పిటల్ ఎండీ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో 500 మందికి ఉచిత వైద్య సేవలు అందించి ట్రస్టు ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సంగం డెయిరీ ఆవరణలో డీవీసీ వర్ధంతి ఘనంగా జరిగింది. సంగం డెయిరీ పాలకవర్గ సభ్యులు ఏడు లక్షల నగదు చెక్కును డీవీసీ హాస్పిటల్‌కు చైర్మన్ నరేంద్ర కుమార్ చేతుల మీదుగా అందజేశారు. సంగం డెయిరీ పరిధిలో మరణించిన పాల రైతులు 8 మందికి రూ. 4.25 లక్షల పరిహారం, ఇద్దరు ఉద్యోగుల కుటుంబాలకు రూ.2.71 లక్షలు, పాడి గేదెలు చనిపోయిన 12 మంది రైతులకు రూ. 6.70 లక్షలు పరిహార చెక్కులను చైర్మన్ నరేంద్ర కుమార్ అందచేశారు. పొన్నూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో వర్ధంతి కార్యక్రమం జరిగింది. సంగం డెయిరీ మాజీ చైర్మన్ కుర్ర వీరయ్య చౌదరి, సుదీర్ఘకాలం పార్టీకి సేవ చేసిన సీనియర్ కార్యకర్తలను ఘనంగా సత్కరించి ఆర్థిక సహాయం అందించారు.

పేదింటికి.. చేయూత

(5వ పేజీ తరువాయి)

టిడ్కో ఇళ్లు అందజేసింది. పీఎంఏవై(గ్రామీణ) కింద గ్రామీణ పేదలకు ఇళ్ల నిర్మాణానికి చేయూత ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 2.95 కోట్ల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వ్యాప్తంగా అర్హులైన పేదల కోసం సర్వే చేపట్టింది.

రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు..

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారిని ఒక విభాగంగా గుర్తించి వారికి సొంత ఇల్లు అందుబాటులోకి తేవడమే ఈ విధానం ముఖ్య ఉద్దేశం. సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి కేంద్రం నుంచి ఆర్థిక సహాయం అందజేస్తుంది. లేనివారికి స్థలం అందజేసి అందులో ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఏర్పాట్లను ప్రభుత్వమే చూసుకుంటోంది. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక విధాన ప్రకటన చేసింది. పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బెనిఫిషరీ లెడ్ కన్‌స్ట్రక్షన్(బీఎల్‌సీ) కింద వీరికి ఇప్పటి వరకూ కేంద్రం అందిస్తున్న ఆర్థిక సహాయం కూడా రెట్టింపు కానుంది. ఇప్పటి వరకూ ఇచ్చే రూ.1.50 లక్షల సాయాన్ని ఇక నుంచి రూ.2.50 లక్షలకు పెంచాలని కేంద్రం భావిస్తోంది. ఈ మొత్తంలో కేంద్రం వాటాలో ఎలాంటి మార్పు లేదు. గతంలో మాదిరిగా కేంద్రం రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తుండగా, అదనంగా ఇచ్చే రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వ 40 శాతం మ్యాచింగ్ గ్రాంటుగా ఉంటుందని సమాచారం. దీంతోపాటు స్వచ్ఛ భారత్ స్కీమ్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు, నరేగా మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.27 వేలు అందించనున్నారు. ఈ పథకం కింద మురికివాడలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వితంతువులు, దివ్యాంగులు, పారిశుధ్య కార్మికులు, వీధి వ్యాపారులు, చేతివృత్తుల వారు, అంగన్వాడీ కార్యకర్తలకు ఈ స్కీమ్ కింద సహాయం అందుతుంది.

● **అఫర్డబుల్ హౌసింగ్ (ఏహెచ్‌పీ)**

ఈ విభాగం కింద రాష్ట్రాలు, నగరాలు, ఇతర ప్రైవేటు ఏజెన్సీల ద్వారా కొంత వాటా, కేంద్రం నుంచి కొంత వాటా వేసి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య పద్ధతుల్లో ఇళ్లను నిర్మిస్తారు. వీటిని ప్రధానంగా ఆర్థికంగా బలహీన సమూహాలు (ఈడబ్ల్యూఎస్)లకు అందిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల మాదిరిగానే కొంత మొత్తం చెల్లించి ఈ అపార్టుమెంట్లలో ప్లాట్లను అందజేస్తారు. సరసమైన ధరల్లో అందించేందుకు వీలుగా రిడీమబుల్(వినియోగించుకో తగిన) హౌసింగ్ ఓచర్లను అందుబాటులో ఉంచుతారు.

● **వడ్డీ రాయితీ..**

ఎంతో కొంత స్థోమత ఉండి ఇల్లు కట్టుకునేందుకు బ్యాంకు ద్వారా రుణం పొందేవారిని ఉద్దేశించి ప్రభుత్వం ఈ విధానాన్ని ముందుకు తెచ్చింది. గరిష్ఠంగా రూ.25 లక్షల రుణం, లేదా రూ.35 లక్షలు ఇంటి విలువ ఉండి వార్షిక ఆదాయం రూ.3 లక్షల వరకూ ఉన్న ఈడబ్ల్యూఎస్ కుటుంబాలు, 3- 6 లక్షల ఆదాయం ఉన్న ఎల్‌ఐజీ కుటుంబాలు, 6- 9 లక్షల ఆదాయం ఉన్న ఎంఐజీ కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వడ్డీ రాయితీ వస్తుంది. వీరికి వడ్డీ రాయితీ ఐదేళ్లపాటు గరిష్ఠంగా రూ.1.80 వేలు అందజేస్తారు.

జీడీసీసీబీ రేసులో.. ఆ ఇద్దరు

(5వ పేజీ తరువాయి)

నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, నారా లోకేశ్ ఆశీస్సులు కూడా అప్పారావుకే ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాత్రం తన నియోజకవర్గానికి చెందిన మక్కెనను కాదని అప్పారావుకు లేఖ ఇవ్వడం భావ్యం కాదని నిరాకరించినట్లు తెలిసింది. ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు తొలుత మక్కెనకే లేఖ ఇచ్చినప్పటికీ అప్పారావుకు కూడా లేఖ ఇస్తూ తన తొలి ప్రాధాన్యం మాత్రం మక్కెనకేనంటూ చెప్పినట్లు తెలిసింది. దీంతో అప్పారావు పేరును అధిష్ఠానం లాంఛనంగా ప్రకటించటం మాత్రమే మిగిలిఉందని చెబుతున్నారు. మక్కెన టీడీపీలో కొత్తగా చేరడం, ఇద్దరూ ఒకేసామాజికవర్గం కావడంతో ఆయన పోటీలో వెనకపడ్డారు. పైగా వినుకొండ ఎమ్మెల్యే జీవీకి ఇటీవల కేబినెట్ మంత్రిగా హోదా ఉన్న చీఫ్‌విప్ పదవి ఇవ్వడంతో అదే నియోజకవర్గానికి చెందిన మక్కెనకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో కీలకమైన జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవి వరించే అవకాశాలు తక్కువగా ఉన్నాయి.

'బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని'కి రూ.పది లక్షల విరాళం


చెక్కు అందజేస్తున్న డాక్టర్ కోడెల శివరామకృష్ణ దంపతులు

నరసరావుపేట టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలోని 'బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని' పథకానికి శుక్రవారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. కోడెల శివప్రసాదరావు తనయుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్ ఈ విరాళాన్ని అందజేశారు. తన పుట్టిన రోజు సందర్భంగా కోడెల శివప్రసాదరావు ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఈ విరాళాన్ని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి శుక్రవారం తిరుమలలో అందజేశారు. కోడెల ఆశయాలకు అనుగుణంగా రూ.10 లక్షల విరాళాన్ని పేదల వైద్య సేవలకు అందజేసినట్లు ఆయన తెలిపారు.

యూజీసీ నిబంధనల ప్రకారమే పదోన్నతులు

గుంటూరు సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన సీనియర్ ప్రొఫెసర్ పదోన్నతుల ప్రక్రియ యూజీసీ నిబంధనల ప్రకారమే జరిగాయని యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు పేర్కొన్నారు. యూనివర్సిటీ పదోన్నతులు, బదిలీల్లో అక్రమాలు జరిగినట్లు వచ్చిన వార్తలపై ఆయన స్పందించారు. జీవో 20 ప్రకారం అర్హత కలిగిన వారికే పదోన్నతులు కల్పించినట్లు ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయం పరిపాలన సౌలభ్యం, జవాబుదారితో సాధారణ బదిలీలు చేసినట్లు వివరించారు. గత ప్రభుత్వ రాజకీయ ఒత్తిడుల మూలంగా అవసరానికి మించి తిరుపతిలో ఉన్న సూపరింటెండెంట్లను అంచలవారీగా సవరించుకుంటూ వస్తున్నామని తెలిపారు. ఐఏటీ బిల్డింగ్ నిర్మాణం ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా ఏపీఐఐసీ నిధులను విడతల వారీగా విశ్వవిద్యాలయం నుంచి నేరుగా విడుదల చేస్తారనీ, రూ.15 కోట్లు నేరుగా డ్రా చేయడం అసాధ్యం అని పేర్కొన్నారు. నిబంధనలు అనుసరించి నిధులన్నీ యూనివర్సిటీ కంట్రోలర్ దగ్గరే ఉంటాయన్నారు. విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలో భర్తీ కాకుండా మిగిలిన బీఎస్సీ అగ్రికల్చర్ 140 సీట్లు విశ్వవిద్యాలయ నియమ, నిబంధనలకు అనుగుణంగా భర్తీ చేసినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయంలో పేపర్ లీకేజీ విషయంపై సదరు వ్యక్తిపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

వినుకొండటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో శుక్రవారం ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలో రైతుల వద్ద నుంచి వెయ్యి టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తేమశాతం 17 ఉన్న ధాన్యానికి ప్రభుత్వం రూ.1740 మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్‌తో కలిసి పట్టణంలోని కారంపూడి రోడ్డులోని శాఖాంబరి రైస్ మిల్లు, ఏనుగుపాలెం రోడ్డులోని మక్కెన రామాంజనేయులు రైస్ మిల్లును తనిఖీచేశారు. తహసీల్దార్ సురేష్, ఆర్ఐ శ్రీహరి, ఏడీఏ రవిబాబు, ఏవో వరలక్ష్మి, ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెట్టుబడులే లక్ష్యంగా దావోస్ పర్యటన


ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బృందం దావోస్ పర్యటన విజయవంతమైందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన ముగించుకొని రాష్ట్రానికి రావటంతో తాడేపల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వనరులతో పాటు నైపుణ్యం కలిగిన మానవ వనరులు, పౌర సేవల్లో టెక్నాలజీ వినియోగం, స్పీడ్ డూయింగ్ బిజినెస్ తదితర అంశాలను సీఎం బృందం కార్పొరేట్ దిగ్గజాలకు వివరించిందన్నారు. ప్రపంచ దేశాల నుంచి దావోస్‌కు వచ్చిన పెట్టుబడి దారులను ఆకట్టుకోవటంతో చంద్రబాబు సంపూర్ణంగా సఫలమయ్యారన్నారు. వివిధ రంగాలకు చెందిన దాదాపు 15 ప్రపంచ అత్యున్నత వాణిజ్య సంస్థల అధిపతులతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు ఇచ్చే ప్రోత్సాహకాలను తెలియజేశారన్నారు.

సీఎం దావోస్ పర్యటన విజయవంతం

● కొమ్మాలపాటి శ్రీధర్



గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను దావోస్ సదస్సు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రపంచ దేశాలకు చాటడం ద్వారా ఆయన పర్యటన విజయవంతమైందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఆ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్విట్జర్లాండ్‌లోని భారత రాయబారి మృదుల్ కుమార్‌తో జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో సమావేశమైన చంద్రబాబు స్విస్ కంపెనీలు ఓర్లికాన్, స్విస్ మెన్, అంగ్స్ ఫిష్షర్, స్విస్ టెక్స్‌టైల్స్ సంస్థల సీఈఓలతో ఏపీలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారని తెలిపారు. సీఐఐ నిర్వహించిన ప్రత్యేక సెషన్‌లో పాల్గొని గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్‌పై ఎంతో ఆసక్తిదాయకంగా ప్రసంగించి, స్వర్ణాంధ్ర- 2047 విజన్ డాక్యుమెంటులోని 10 మార్గదర్శక సూత్రాలను వివరించారన్నారు. దావోస్ వేదికగా జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో మంత్రి లోకేశ్ రాష్ట్రానికి భారీ పరిశ్రమలను ఆహ్వానించి, తద్వారా నిరుద్యోగ యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలను సాధించాలని అహర్నిశలు కృషి చేశారన్నారు.

దావోస్ పర్యటనతో ప్రగతికి బాటలు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి



చిలకలూరిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో కూడిన బృందం దావోస్ పర్యటన విజయవంతం కావడంపై స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. బ్రాండ్ ఏపీని ప్రమోట్ చేయడంతో లక్ష్యం నెరవేరిందని చెప్పారు. ఈ బృందం వేసిన ప్రతి అడుగు రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందని అన్నారు. జ్యూరిచ్ విమానాశ్రయంలో అడుగిడింది మొదలు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఆలోచనలను, రాష్ట్రంలోని వనరులు, అవకాశాలకు ముడిపెట్టి ఇచ్చిన వివరణ, సదస్సులో పాల్గొన్న ప్రతి కంపెనీ, ప్రతి సీఈవో ఏపీ గురించి ఆలోచించేలా చేసిందని వివరించారు. ఓ వైపు వివిధ వర్గాల ప్రతినిధులతో చర్చలు జరుపుతూనే మరోవైపు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి సన్ రైజ్‌స్టేట్ బ్రాండ్ ను ప్రపంచస్థాయిలో ప్రమోట్ చేయడంలో చంద్రబాబు, లోకేశ్‌ల లక్ష్యం నెరవేరిందని పేర్కొన్నారు.

పారిశ్రామికవేత్తలకు భరోసా

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



పొన్నూరుటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దావోస్ పర్యటన ద్వారా పారిశ్రామికవేత్తలకు కూటమి ప్రభుత్వం పెట్టుబడులు పెట్టడానికి పూర్తి భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం పొన్నూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటనపై వైసీపీ విమర్శలు విడ్డూరంగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు కూడా పూర్తికాక ముందే విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అదాని వద్ద రూ.1872 కోట్ల లంచం తీసుకున్నట్లు అమెరికా కోర్టులో కేసులు నమోదు కావటంతో అంతర్జాతీయంగా ఆంధ్రప్రదేశ్ పరువు పోగొట్టిన ఘనత జగన్ రెడ్డిదేనని స్పష్టం చేశారు. దావోస్ పెట్టుబడులు ఆకర్షించటానికి ఓ వేదిక అన్నారు. పారిశ్రామికంగా ఆంధ్రప్రదేశ్ ఎదుగుతుంది అనటంలో సందేహం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

మోడల్ పాఠశాలలు ఏర్పాటుకు కసరత్తు

● పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు


పెదమక్కెన పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు

సత్తెనపల్లి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మోడల్ పాఠశాలలు ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించినట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. శుక్రవారం పెదమక్కెనలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఈ, ఎస్టీ ఎలిమెంటరీ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు ఇంగ్లిషులో సంభాషించటం చూసి విద్యార్థులు, ఆ పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. గ్రామంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎన్ని ఉన్నాయి?, ఏ స్కూళ్లను అనుసంధానం చేయాలనే వివరాలను డీఈవో చంద్రకళ, గ్రామ సర్పంచిని అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఈ పాఠశాలను గ్రామంలో మోడల్ పాఠశాలగా తయారు చేయాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి పంచాయతీలో ఒక మోడల్ పాఠశాలను ఏర్పాటు చేసేలా జాబితాను తయారు చేసి వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మండలంలోని పాఠశాలలను తనిఖీ చేశారు. పల్నాడు జిల్లా విద్యా శాఖ అధికారి చంద్రకళ, ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	145,154,165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 36.97 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

మిర్చి తోటల పరిశీలన

అచ్చంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిగురుపాడు గ్రామంలో శుక్రవారం ఉద్యానశాఖ అధికారి శ్రీ నిత్య మిరప తోటలను పరిశీలించారు. నల్ల తామర పురుగు తెగులును గుర్తించి నివారణ పద్ధతుల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన వన శాఖ అధికారితో పాటు రైతు సేవా కేంద్ర సిబ్బంది మాన్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీపీవోగా ఉద్యోగోన్నతి

సత్తెనపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘంలో టీపీఎస్‌గా పని చేస్తున్న సునీతను టౌన్ ప్లానింగ్ అధికారిణిగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ డైరెక్టర్ ఆఫ్ కంట్రి ప్లానింగ్ కార్యాలయ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే సునీత సత్తెనపల్లి నుంచి విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌లో టీపీవోగా విధుల్లో చేరాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శివరామ్ జన్మదిన వేడుకలు

సత్తెనపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పట్టణంలోని డాక్టర్ కోడెల కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఏరియా వైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.

సౌత్ సెంట్రల్ రైల్వే సలహాదారుడిగా ఉల్లం

సత్తెనపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సౌత్ సెంట్రల్ రైల్వే న్యాయ సలహాదారుడిగా పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయవాది ఉల్లం శేషగిరిరావును నియమిస్తూ సికింద్రాబాద్ రైల్వే న్యాయాధికారి ఎస్ మురళీకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ తన నియమకానికి కృషి చేసిన కాశిరెడ్డి, పాపిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉల్లం నియామకం పట్ల న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, పిన్నమనేని పాములయ్య, ఏజీపీ భగ్గి నరసింహారావులు హర్షం వ్యక్తం చేశారు.

బ్రాహ్మణపల్లి సర్పంచ్‌గా సుభాషిణి

రాజుపాలెం,జనవరి24(ఆంధ్రజ్యోతి):మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్‌గా బిట్రా సుభాషిణి ఎన్నికైయ్యారు. ఇప్పటి వరకు సర్పంచ్‌గా కొనసాగిన వెంకటపతి సోలవుపై వెళ్లటంతో సుభాషిణి సర్పంచ్ అయ్యారు. పంచాయతీ ఎన్నికల సమయంలో ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు సుభాషిణి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.

గోకులాలతో వెన్నుదన్ను

రెంటచింతల,జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి అనుబంధమైన పాడి పరిశ్రమపై ఆధారపడి వేలాది మంది జీవిస్తున్నారని వారికి వెన్నుదన్నుగా ఉండేందుకు గోకులాలను ప్రభుత్వం నిర్మిస్తుందని మండల స్పెషలాఫీసర్ వీ.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లవరం గ్రామంలో రూ.2.30 లక్షలతో జల్లా బాబు నిర్మించిన గోకులాన్ని ఆయన ప్రారంభించారు.పాడి రైతులకు గోకులాలను కేటాయించడం అదృష్టంగా భావించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సరోజని దేవీ,ఏపీవో జయచంద్ర,సర్పంచ్ బాల సైదులు ఉపాధిహామి సిబ్బంది పాల్గొన్నారు.

250 మందికి వైద్య సేవలు

క్రోసూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 88 తాళ్ళూరులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో 250 మందికి వైద్య సేవలు అందించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు నలజాల సదాశివరావు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. జనరల్ మెడిసిన్, కంటి, గుండెకు సంబంధించిన వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 140 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 120 మందిని ఆపరేషన్‌ల కోసం ఎంపిక చేశారు. 40 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. డాక్టర్ ఆళ్ళ స్థిమిత, డాక్టర్ కొమ్మినేని పవన్, డాక్టర్ ఆళ్ళ శారద వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు జీ బాలరామకృష్ణంరాజు, సర్పంచ్ అత్తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీ నేత శ్రీనివాసరావు మృతి

● నివాళులర్పించిన నాయకులు

దుర్గి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గికి చెందిన టీడీపీ సీనియర్ నేత కటకం శ్రీనివాసరావు అనారోగ్య కారణాలతో గురువారం అర్ధరాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, కూటమి నేతలు పలువురు శుక్రవారం శ్రీనివాసరావు గృహానికి చేరుకొని ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెదకూరపాడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కాశిపాడు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాశిపాడు గ్రామానికి చెందిన సంకు నాగేశ్వరరావు(59) టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై అమరావతి వెళ్ళి తిరిగి వస్తుండగా కాశిపాడు శివారులో ఆగి ఓ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన నాగేశ్వరరావును నరసరావుపేటలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ గిరిబాబు తెలిపారు. ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ ఆదాయానికి అధికారుల గండి



జలవనరుల శాఖ కార్యనిర్వహక ఇంజనీరు కార్యాలయం

- హెచ్ఆర్ఏ కటింగ్ తప్పించుకోవడానికి కుటుంబసభ్యుల పేర్లపై గృహాలు కేటాయింపు
- రూ. వెయ్యి చెల్లించి సుమారు రూ.15 వేలు నుంచి రూ.20 వేలు మిగుల్చుకుంటున్న వైనం
- కీలకపాత్ర పోషిస్తున్న సీనియర్ అసిస్టెంట్
- విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి..

మాచర్లటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జలవనరుల శాఖ కార్యనిర్వహక ఇంజనీరు కార్యాలయ సిబ్బంది ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. నాగార్జునసాగర్‌డ్యాం పరిధిలో మాచర్లలో పీడబ్ల్యూడీ కాలనీ ఏర్పాటు చేశారు. వివిధ కేటగిరీల్లో సుమారు 300 క్వార్టర్స్ ఏర్పాటు చేశారు. ఇందులో ఆఫీసర్స్ స్థాయి కేడర్ గల వారికి ప్రత్యేకంగా విశాలమైన భవనాలు నిర్మించారు. ప్రస్తుతం 20 మంది అధికారులు ఆయా గృహాల్లో నివాసముంటున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

పీడబ్ల్యూడీ కాలనీలో ఎల్‌డీసీ16, బీ27, జేఈ 7, జేఈ 23, జేఈ 20, జేఈ 26, జేఈ 21, జేఈ 14, ఎల్‌డీసీ 23, జేఈ 10, యూడీసీ 2, పీ 73 క్వార్టర్స్‌లో జలవనరుల శాఖ ఉద్యోగులు నివాసముంటున్నారు. వీరు ఆ కార్టర్స్‌లో నివాసం ఉంటున్నందుకు గానూ హెచ్ఆర్ఏ కింద రూ.10 వేల నుంచి రూ. 15 వేల దాకా జీతంలో కోత విధింపు ఉంటుంది. అందుకని ఆశాఖ ఉద్యోగులు ఆ కాలనీలోని గృహాలను వారి కుటుంబ సభ్యుల పేర్లు మీద అలాట్‌మెంట్ చేయించుకొని హెచ్ఆర్ కటింగ్ నుంచి మినహాయింపు పొందుతున్నారు. పైగా వారంతా ఆ గృహాల్లోనే ఉంటూ నెలకు ఒక్కోక్వార్టర్‌కు విద్యుత్, నీరు, అద్దెకింద రూ.1000 మాత్రమే ప్రభుత్వానికి చెల్లిస్తున్నారు. అదే సందర్భంలో మొత్తంగా ప్రభుత్వానికి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఎగనామం పెడుతున్నారు. జలవనరులశాఖ ఉద్యోగులు కేటాయించిన క్వార్టర్స్‌ను వారి కుంటుంబ సభ్యుల పేర్ల మీద ఎలా అలాట్‌మెంట్ అయిందన్న విషయం కూడా తేలాల్సి ఉంది.



జలవనరుల శాఖ అధికారుల క్వార్టర్స్

కీలక భూమిక పోషిస్తున్న సీనియర్ అసిస్టెంట్..

జలవనరుల శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా వ్యవహరిస్తున్న ఓ ఉద్యోగి సుదీర్ఘ కాలం నుంచి మాచర్ల శాఖలోనే పనిచేయడం వలన అతనికి అధికారులందరూ జీహుజూర్ అనాల్సిన పరిస్థితి నెలకొంది. అతను చెప్పిందే అక్కడ జరుగుతుంది. ఉన్నతాధికారులు కూడా అతని మాట జవదాటే పరిస్థితి లేదు. హెచ్ఆర్ఏ కటింగ్ కాకుండా ఉద్యోగుల బంధువుల పేరుపై క్వార్టర్స్‌ను బదిలీ చేయడంలోను, మరికొంత మంది ప్రైవేటు వ్యక్తులకు కూడా క్వార్టర్స్ అలాట్‌మెంట్ చేయడంలో క్వార్టర్‌కు రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకు ముడుపులు దండుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జలవనరులశాఖ ఉన్నతాధికారులు మాచర్లశాఖలో జరుగుతున్న సంఘటనలపై దృష్టిసారించి సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యతక ఎంతైనా ఉంది.

పురుగుమందుల షాపులపై విజిలెన్స్ దాడులు

● రూ 1.80 లక్షలు విలువైన ఎరువులు సీజ్..

● రూ.1.40 లక్షల పురుగు మందుల అమ్మకాలు నిలిపివేత ..6(ఏ) కేసు



పురుగు మందుల షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

మాచవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మాచవరంలో విజిలెన్స్ అధికారులు పురుగుమందుల షాపులపై దాడులు చేశారు. శ్రీ వీరాంజనేయ ట్రేడర్స్ షాపులో తనిఖీలు చేపట్టారు. ఈ షాపులో ఓ ఫాం లేకుండా ఎరువుల అమ్మకాలు జరుగుతున్నట్లు గుర్తించారు. దీనికి గాను రూ.1.80 లక్షలు విలువ గల ఎరువులను సీజ్ చేశారు. అలాగే రూ.1.40 లక్షల విలువైన పురుగుమందుల అమ్మకాలను నిలిపిసినట్లు అధికారులు తెలిపారు. షాపులో స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా లేవని, ఈ పాసు యంత్రాలు పనిచేయటం లేదని, అనుమతులు లేకుండా కొన్ని రకాల బయోమందులు విక్రయిస్తున్నట్టు తనిఖీల్లో వెల్లడైందన్నారు. అంతేగాకుండా పీసీ సర్టిఫికెట్ లేకుండా పురుగు మందుల విక్రయాలు జరుగుతున్నట్టు తేలిందని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పీ శివాజీ తెలిపారు. ఈ దాడుల్లో ఏవో సీహెచ్ ఆదినారాయణ, వారి సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక వ్యవసాయశాఖ అధికారులు రామమ్మ, నరసయ్య, కరుణ కుమారి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు చేయూతగా 'డీవీసీ అభయ'

● పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర

బెల్లంకొండ, జనవరి24 (ఆంధ్రజ్యోతి) : సంగం డెయిరీ డీవీసీ అభయ పథకం బాధిత కుటుంబాలకు చేయూతనిస్తోందని పొన్నూరుఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర అన్నారు. శుక్రవారం చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలోని సంగం డెయిరీవద్ద డీవీసీ అభయ పథకంనగదు చెక్కును పంపిణీ చేశారు. బెల్లంకొండ గ్రామానికి చెందిన సపావత్ రాములునాయక్ సంగం డెయిరీకి పాల విక్రేత కాగా, ఇటీవల ఆయన అనారోగ్యంతో మృతి చెందాడు. డీవీసీ అభయ పథకం ద్వారా రాములు నాయక్‌కి వచ్చిన రూ.60 వేల చెక్కును అతని కుటుంబీకులకు ధూళిపాళ్ళ నరేంద్ర అందజేశారు.



చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర

కార్యక్రమంలో డైరెక్టర్ ధర్మారావు, శేషగిరి కుమారి, గంగిరెడ్డిపాలెం సంగం డెయిరీ ఇన్‌చార్జి కే శ్రీనివాస్, సూపర్‌వైజర్ సుధీర్, మండల టీడీపీ కోర్ కమిటీ సభ్యుడు, బెల్లంకొండ వెండర్ పాయింట్ అధ్యక్షుడు వెన్నా సీతా రామిరెడ్డి పాల్గొన్నారు.

తాగు నీటి కొరతను నివారిద్దాం

● సర్వసభ్య సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీపీ

అచ్చంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాబోయే వేసవి కాలంలో తాగునీటి కొరత ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకుందామని ఇన్‌చార్జ్ ఎంపీపీ గంగసాని నరసింహారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన అచ్చంపేటలోని మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని గంగసాని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల పని తీరుపై చర్చించారు. వేల్పూరు చెరువుకు మరమ్మతులు చేపట్టి కాలువ నీటితో నింపాలని, ఆర్‌కేజీ పాలెంలో తాగు నీరు రావటంలేదని సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. సమావేశంలో ఎంపీడీవో కే శ్రీనివాసరావు, తెల్ల మేకల నాగరాజు, పలు శాఖల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

వెల్దుర్తి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం విజయపురిసౌత్ గ్రామానికి చెందిన పెంటిబోయిన స్నేహితకు మంజూరైన రూ. 40 వేల విలువైన సీఎం రిలీఫండ్ చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అందించారు. స్నేహిత అనారోగ్య కారణాలతో బాధపడుతూ సీఎం సహాయ నిధికి దరఖాస్తు కోగా మంజూరైన నగదు చెక్కును శుక్రవారం స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో స్నేహిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో గుండాల శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ ఎన్ బసివిరెడ్డి, సత్తిబాబు, నూకరాజు, బాలస్వామి, చిట్టి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వైద్యం పెరిగింది..

● డాక్టర్ గొట్టిముక్కల శశిభూషణ్

పిడుగురాళ్ళ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఆధునిక వైద్యం రోజురోజుకి పెరిగిపోతోందని, అందుకు తగిన విధంగా వైద్యులు మారాల్సిన అవసరం ఉందని గుంటూరుకు చెందిన చందన పిల్లల వైద్యశాల వైద్యులు గొట్టిముక్కల శశిభూషణ్ తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్ల ఐఎంఏ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. నవజాత శిశువులలో స్కీనింగ్ ఆవశ్యకత గురించి డాక్టర్ శశిభూషణ్ వివరించారు. సమావేశంలో పిడుగురాళ్ల ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ధూళిపాళ్ల భరత్‌కుమార్, కార్యదర్శి బొర్రా రాంప్రసాద్, సీనియర్ వైద్యులు కేవీ సుబ్బారావు, ఆలా సాంబశివరావు, సీహెచ్ సుబ్బారావు, రాయపాటి వెంకటేశ్వర్లు, పెండ్యాల సునీల్, చింతలపూడి అశోక్ కుమార్, కర్నాటి వరలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

సత్తెనపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పొన్నూరు న్యాయవాది బేతాల ప్రకాష్‌పై చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించారు. న్యాయదేవత విగ్రహంవద్ద ఆందోళనచేశారు. కార్యక్రమంలో అనీల్ కుమార్, శ్రీనివాసరావు, చలపతిరావు పాల్గొన్నారు.

డ్రోన్ కెమేరాలతో మరింత భద్రత

దాచేపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ సర్వేలైన్స్ పద్ధతుల ద్వారా గ్రామాల్లో భద్రతను మెరుగుపరచటం, నేరాలకు చెక్ పెడతామని దాచేపల్లి ఎస్ఐలు పాపారావు, సౌదర్‌రాజన్‌లు అన్నారు. శుక్రవారం దాచేపల్లి మండలం రామాపురం గ్రామంలో సీసీ టీవీ కెమేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీసీ కెమేరా ఏర్పాటు చేసుకోవటం ద్వారా నేరాలను నిరోధించటంతో పాటు భద్రత కూడా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

భూమిని పరిశీలించిన ఆర్డీవో

మాచవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మాచవరం మండలంలోని వేమవరం, తాడుట్ల రెవెన్యూ శివార్లలో సమస్యాత్మకంగా భూమిని గురజాల ఆర్డీవో మురళీ కృష్ణ శుక్రవారం పరిశీలించారు. సర్వే నెంబరు 404/42లో ఆర్ఎస్ఆర్ రికార్డులలో చుక్కల భూమిగా ఉంది. అయితే ఫారెస్టు అధికారులు సదరు సర్వే నెంరులో భూమి మాదంటూ రెవెన్యూ అధికారులకు సూచిస్తున్నారు. ఈ సమస్యాత్మక భూమిని ఆర్డీవో మురళీకృష్ణ పరిశీలించి, రెవెన్యూ రికార్డుల్లో చుక్కల భూమిగా ఉండగా ఫారెస్టు అధికారులుదానికి సంబంధించి పత్రాలేమైనా ఉంటే చూపించమని అడిగారు. ఆర్డీవోవెంట తహసీల్దార్‌క్షమారాణి, సర్వేయర్ సాల్మన్ రాజు, ఆర్ఐ కోటేశ్వరరావు, వీఆర్వో పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

బెల్లంకొండ, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ అధికారులు శుక్రవారం తెల్లవారు జామున మండలంలోని వన్నాయపాలెం గ్రామంలో దాడులు నిర్వహించి నాటుసారా విక్రయిస్తున్న బోనం రామకృష్ణను అదుపులోకి తీసుకున్నట్టు క్రోసూరు ఎక్సైజ్ సీఐ తులసీ తెలిపారు. వన్నాయపాలెం గ్రామానికి చెందిన భువనం రామకృష్ణ కాపు సారా విక్రయిస్తున్నట్టు సమాచారం రావటంతో తెల్లవారు జామున అతని వద్ద తనిఖీలు నిర్వహించగా ఒక లీటరు కాపు సారాను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ ఘటనలో రామకృష్ణ పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు సీఐ పేర్కొన్నారు.

27న కంది కొనుగోలు కేంద్రం

దుర్గి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముటుకూరులో ఈనెల 27న కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు ఎంపీపీ సునీతా శంకర్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాట్లాడుతూ కంది పంటను అమ్ముకోదలచిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆయన వెంట ఏవో అమీర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అభ్యంతరాలుంటే తెలపండి

మాచర్లటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇప్పటి వరకు ఇబ్బందిగా ఉన్న నిబంధనలను సరళీకృతం చేసేందుకు నూతన బిల్డింగ్ ప్లాన్‌ను రూపొందించామని, ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలని మున్సిపల్ కమిషనర్ వేణుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సచివాలయ, మున్సిపల్, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల నోటీసు బోర్డులో సర్క్యూలేషన్ ప్లాన్ల వివరాలు అందుబాటులో ఉంచామన్నారు. అభ్యంతరాలు, సూచనలను ఏడు రోజుల్లో తెలియజేయాలని కమిషనర్ కోరారు.


పాఠశాలకు కంప్యూటర్ అందజేత

నకరికల్లు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లు మెయిన్ ప్రాథమిక పాఠశాలకు రూ 60 వేలు విలువ కలిగిన కంప్యూటర్, టేబుల్‌ను ఐడీబీ బ్యాంక్ ప్రతినిధులు అందజేసినట్టు పాఠశాల హెచ్ఎం మేదరమెట్ల స్వామి తెలిపారు. కార్యక్రమంలో నరసరావుపేట ఐడీబీఐ బ్రాంచ్ మేనేజర్ భవ్య భారతి, మంగళగిరి మేనేజర్ కామేశ్వరరావు, పవన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా జగనన్న కాలనీలు

● రాత్రివేళల్లో బెంబేలెత్తిపోతున్న కాలనీవాసులు

గురజాలటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగనన్న కాలనీలు మందుబాబులకు అడ్డాగా మారాయి. 2021 సంవత్సరంలో గురజాల నగర పంచాయతీ పరిధిలోని జగమహేశ్వరపురం, పట్టణంలోని హైవే పక్కన జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. ఆయా చోట్ల 1372 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయగా, 893 గృహనిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ కాలనీలో ప్రస్తుతం సుమారు 100 కుటుంబాల వారు నివసిస్తున్నారు. కాలనీలో కొందరు మందుబాబులు రాత్రి, పగలు తేడాలేకుండా మద్యం తాగుతూ మద్యం సీసాలను ఎక్కడబడితే అక్కడ పగులకొట్టడం, ఆ సందర్భంగా తెచ్చుకున్న ఆహార పదార్థాలను అక్కడే పడవేయటం చేస్తున్నారు. రాత్రయితే కాలనీలోని ప్రధానవీధుల్లో ఆరుబయటే కూర్చొని తాగుతూ, కేకలు, ఈలలు వేస్తూ గోల చేస్తున్నారు. ఆ సమయంలో కాలనీకి వెళ్లే వారిని నిలిపి దుర్భాషలాడుతూ బెంబేలెత్తిస్తున్నారు. దీంతో కాలనీవాసులు హడలిపోతున్నారు. మందుబాబుల ఆగడాలను నియంత్రించాలని, వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు అధికారులను కోరుతున్నారు.



జగనన్న కాలనీలోని పలు ప్రాంతాల్లో మద్యం సీసాలు

బాలికలు చైతన్యవంతులుగా ఎదగాలి

● బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర సభ్యురాలు పద్మావతి

పిడుగురాళ్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి బాలిక పాఠశాలస్థాయి నుండే చైతన్యవంతులుగా ఎదిగే అవకాశాలను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. ప్రపంచ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పిడుగురాళ్ల జడ్పీ పాఠశాలలో విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ పి శ్రీధర్, ఎంపీడీవో రామచంద్రరావు, సీఎస్ డీటీ సుబ్బారావు, హెచ్ఎం ధనలక్ష్మీ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు మెడికల్ సిబ్బంది అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మాచర్ల రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తిపోతల ఆశ్రమ పాఠశాలలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, సూపర్‌వైజర్ లీలావతి, హెచ్ఎం దుర్గాభవాని పాల్గొన్నారు.

దుర్గి, (ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీ స్కూల్‌లో జనసేన నేతలు ఆధ్వర్యాన బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజినేయులు, ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి పులి హరి, తోటకూర శ్రీను, రుద్రాల రవి, సూరె సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి, (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని సుగాలీ కాలనీ జడ్పీ హైస్కూల్లో బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు దర్మసింగ్ శాస్త్రి, ఆసియాలు బాలికల భద్రత, బాల్య వివాహాలు, పౌష్టికాహారం, రక్త హీనత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ప్రియదర్శిని, ఐసీడీఎస్ సూపర్ వైజర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదకూరపాడు,(ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని నిర్వహిం చారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, వైద్యాధికారులు డాక్టర్ ఆదిత్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ మున్నీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు తల్లులను దుశ్శాలువాలతో సన్మానించారు.



అమరావతిలో పరిటాల రవికి నివాళులర్పిస్తున్న పెదమద్దూరు టిడీపీ నేతలు

పేదల పక్షపాతి పరిటాల రవి

● 20వ వర్ధంతి సందర్భంగా టీడీపీ నేతల నివాళులు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి) పేదల పక్షపాతి మాజీ మంత్రి పరిటాల రవి అని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు అన్నారు. శుక్రవారం పరిటాల 20వ వర్ధంతి కార్యక్రమాన్ని మండల పరిధిలోని పెద మద్దూరు గ్రామంలో నిర్వహించారు. ముందుగా జాస్తి పరిటాల విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పొదిలె శ్రీనివాసరావు, పీ. మదన్‌మోహన్, సాంబశివరావు, నరసింహారావు, హరిబాబు, అనిల్‌కుమార్, సుధాకర్, అప్పయ్య పాల్గొన్నారు.

సత్తెనపల్లి,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో మాజీమంత్రులు పరిటాల రవీంద్ర, ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి వర్ధంతులను నిర్వహించారు. టీడీపీ నేతలు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నేత ఎలినేడి రామస్వామి, మన్నవ శారదాదేవి, వక్కంటి అజయ్ కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాండు కాశయ్య గృహంలో పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి, టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు. అందుకూరులో టీడీపీ నేతులల పరిటాల రవీంద్ర విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాళ్ళూరి వాసు, మాజీ ఎంపీపీ దిగుమత్తి అప్పారావు, టీడీపీ నేతలు పాల్గొన్నారు. ఊటుకూరులో పరిటాల విగ్రహానికి తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి వేగుంట రాణి తదితరులు నివాళులర్పించారు.

కానుకమాత తిరునాళ్ల జెండా ప్రతిష్ఠ

రెంటచింతల,జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం రెంటచింతలలో ఫిబ్రవరి 2న ప్రారంభం కానున్న కానుకమాత 175 తిరునాళ్లకు సంబంధించి శుక్రవారం జెండా ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గురువులు వైఎల్ మర్రెడ్డి అధ్యక్షతన దివ్యపూజ బలి నిర్వహించారు. కార్యక్రమంలో దాచేపల్లి సహాయ గురువులు నిఖిల్ తేజ, ఆగస్టీన్, కథోలిక సంఘ పెద్దలు, కన్యా స్త్రీలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

గురజాల డీఎస్పీ జగదీష్ శుక్రవారం చర్చి ప్రాంగణాన్ని పరిశీలించారు. కార్యక్రమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. తిరునాళ్లకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ నాగార్జున, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రిజర్వుడు మద్యం షాపులకు లాటరీ

నరసరావుపేట లీగల్, జనవరి 24, నూతన మద్యం పాలసీలో భాగంగా గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయిస్తూ కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ అరుణ్ బాబు లాటరీ తీశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరిటెండెంట్ మణికంఠ, ఎక్సైజ్ ఎస్సై సోమయ్య, సిబ్బంది పాల్గొన్నారు. నరాసరావుపేట , చిలకలూరిపేట మున్సిపాలిటీలు, రెంటచింతల మండలం, దుర్గి మండలం గౌడ సమామాజిక వర్గానికి వచ్చాయి. సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మాచర్ల, వినుకొండ మున్సిపాలిటీలు, మాచర్లరూరల్, మాచవరం, ఈపూరు రాజుపాలెం, ముప్పాళ్ళ మండలాలు గౌడ కులానికి వచ్చాయి. ఆయా మండలాల్లో మున్సిపాలిటీలో ఈషాపుల ఏర్పాటుకు సంబంధించి విధివిధాలను త్వరలో ప్రకటిస్తారు.

మరిన్ని సేవా కార్యక్రమాలతో రోటరీక్లబ్

పిడుగురాళ్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సేవా కార్యక్రమాలలో రోటరీక్లబ్ ముందుండాలని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె శరత్ చౌదరి తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్లలో రోటరీ గవర్నర్ అఫీషియల్ విజిట్, సభ్యుల సమావేశం నిర్వహించారు. తొలుత కొండమోడు పీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో రోటరీక్లబ్ నూతన శాఖను ప్రారంభించి కళాశాలకు నాలుగు కంప్యూటర్‌లను అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు గుండా అశోక్‌బాబు, డాక్టర్ పంగులూరి విష్ణు బాబు, పసుమర్తి సుబ్రహ్మణ్యం, జూలకంటి సుబ్రహ్మణ్యం, ఆత్మకూరి గురవయ్య, జుజ్జూరి మురళీ, నీరుమళ్ల రాజేష్, డాక్టర్ గుర్రం కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన నగదు జీవోను విడుదల చేయాలి

రాజుపాలెం, జనవరి24 (ఆంధ్రజ్యోతి): రాజుపాలెం గ్రామంలోని పౌరసరఫరాల గోదాములో పని చేస్తున్న కార్మికులు శుక్రవారం గోదాము ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి మనోహర్ హమాలీకూలీ క్వింటాకు రూ.3 పెంచుతున్నట్లు ప్రకటించారు. అయితే ఆ ప్రకటన జీవో రూపం దాల్చలే దని, వెంటనే పెంచిన కూలీ నగదుకి చట్టబద్ధత కల్పిస్తూ జీవో విడుదల చేయాని కోరారు.

హాస్టళ్ల మరమ్మతులకు అనుమతులు

రెంటచింతల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 16 సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులకు పాలనా పరమైన అనుమతులు లభించాయని అందులో భాగంగా శుక్రవారం నుంచి టెండర్లు వేసే ప్రక్రియ ఆరంభమైనట్లు ఏపీఈడబ్ల్యుఐడీసీ (ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)ఏఈఈ జాన్ సైదా తెలిపారు. శుక్రవారం ఆయన రెంటచింతల ఎస్సీ బాలికల సంక్షేమ హాస్టల్‌ను సందర్శించి మరమ్మతులు చేపట్టే గదులను పరిశీలించారు. మాచర్ల పట్టణంలోని 3, రెంటచింతలలోని 1 హాస్టల్ మరమ్మతులకు రూ.55 లక్షలు మంజూరయ్యాయని ఈ సందర్భంగా జాన్ సైదా తెలిపారు.

అనుమానితుల సమాచారమివ్వండి

బెల్లంకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో అనుమానితులు, కొత్త వ్యక్తులు కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానిక ఎస్ఐ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. 2 రోజుల నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో పోలీసుతు తనిఖీలు జరుగుతున్నాయి. మండలంలోని ఒక్కొక్క గ్రామానికి ఒక పోలీసును కేటాయించి నిఘాను పటిష్టం చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

రేపు కంటి వైద్యశిబిరం

వినుకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ సభ్యుడు జీవీ రమణారావు, కోటేశ్వరరావు, రమేష్‌లు శుక్రవారం తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 42వేల మందికి కంటి ఆపరేషన్లు చేయించామని, 23ఏళ్ళుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఆదివారం ఉదయం 9 నుంచి 2గంటల వరకు కంటి వైద్యశిబిరం జరుగుతుందని, ఆరోగ్యశ్రీ, ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డుల జిరాక్స్‌లు తీసుకురావాలని కోరారు.

రిజర్వుడు మద్యం షాపులకు లాటరీ

నరసరావుపేట లీగల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీలో భాగంగా గీత కార్మికులకు అందులోని ఉపకులానికి పల్నాడు జిల్లాలో మద్యం షాపుల కేటాయింపు కోసం శుక్రవారం జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు లాటరీ తీశారు. పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణికంఠ, ఎక్సైజ్ ఎస్ఐ సోమయ్య, సిబ్బంది పాల్గొన్నారు. నర్సారావుపేట మున్సిపాలిటీ, చిలకలూరిపేట మున్సిపాలిటీ, రెంటచింతల మండలం, దుర్గి మండలం గౌడ్ కమ్యూనిటీకి వచ్చాయి. సత్తెనపల్లి మున్సిపాలిటీ పిడుగురాళ్ల, మున్సిపాలిటీ మాచర్ల, మున్సిపాలిటీ వినుకొండ మున్సిపాలిటీ, మాచర్ల రూరల్, మాచవరం, ఈపూరు మండలం రాజుపాలెం మండలం ముప్పాళ్ళ మండలాలు గౌడ కులానికి వచ్చాయి. ఆయా మండలాల్లో మున్సిపాలిటీలో ఈ షాపుల ఏర్పాటుకు సంబంధించి విధివిధానాలను త్వరలో ప్రకటిస్తారు.

రేపు కొండవీడులో వైద్య శిబిరం

నరసరావుపేట లీగల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండవీడు ఈఎన్‌టీ వైద్యశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం గుంటూరు రోడ్‌లోని వైద్యశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ కె.జగన్మోహన్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వైద్యశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. చెవిటి మిషన్‌పై 30శాతం రాయితీ ఇస్తామన్నారు.

27 నుంచి యోగ శిక్షణ శిబిరం ప్రారంభం

నరసరావుపేట టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పట్టాభిరామ స్వామి ఆలయంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఈ నెల 27 నుంచి 184వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభం అవుతుందని వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ నిర్వాహకుడు కూనిశెట్టి వెంకట జనార్దన్ శుక్రవారం తెలిపారు. రోజు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు 28 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. అదనపు సమాచారం కోసం కన్వీనర్ కూనిశెట్టి అనురాధ, 9490846333, 9491665733ను సంప్రదించాలన్నారు.

విశ్రాంత ఉద్యోగుల అన్నదానం

వినుకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నరసరావుపేట రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనం ఆవరణంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భువనగిరి సుబ్రహ్మణ్యం, లక్ష్మీకాంతం, కోటేశ్వరరావు, ఆవుల గోపినారాయణ, రామలింగేశ్వరరావు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

రెండో పట్టణ ఎస్ఐగా లేఖ ప్రియాంక బాధ్యతల స్వీకారం

నరసరావుపేట లీగల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రెండో పట్టణ ఎస్ఐగా కె.లేఖ ప్రియాంక శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో సేవలందించారు. బదిలీపై మహిళా పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అక్కడి నుంచి బదిలీపై రెండో పట్టణంలో పోలీస్ స్టేషన్లో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా సేవలందించిన అశోక్‌బాబు పల్నాడు ఎస్‌బీకి బదిలీ అయ్యారు.

రొంపిచర్ల ఎస్ఐగా మణికృష్ణ...


ఎస్ఐ మణికృష్ణ

రొంపిచర్ల, జనవరి 24 (ఆంధ్రజోతి): రొంపిచర్ల నూతన ఎస్ఐగా సీహెచ్ మణికృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో చందోలు, నరసరావుపేట తదితర పోలీసు స్టేషన్‌లలో విధులు నిర్వహించారు. ఇప్పటివరకు పనిచేసిన ఎస్ఐ అశోక్ నరసరావుపేట రూరల్ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

క్విజ్ పోటీల్లో కొండవీడు విద్యార్థుల ప్రతిభ

యడ్లపాడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రంగోత్సవ్-2025 పోటీలు విజయవాడ పోరంకిలోని మురళి రిసార్ట్స్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలలో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీలో యడ్లపాడు మండలం కొండవీడు ఎంపీయూపీ పాఠశాలకు ప్రథమ స్థానం దక్కింది. పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు కె జ్యోత్స్న, ఎల్.స్వాతి, 7వ తరగతి విద్యార్థి ఎంఎస్‌వీ ఆలిచరణ్‌ల బృందం ప్రథమ బహుమతి సాధించారు. త్వరలో జాతీయస్థాయిలో జరిగే పోటీలలో వీరు పాల్గొంటారు. విద్యార్థులను ఎంఈవోలు ఎంవీ నాగరత్నం, అరుణకుమారి, హెచ్‌ఎం గోరంట్ల శ్రీనివాసరావు, గ్రామసర్పంచ్ యూనిస్, ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వెల్లటూరు విద్యార్థుల ప్రతిభ

బొల్లాపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల దినోత్సవం సందర్భంగా నరసరావుపేటలో జిల్లా స్థాయిలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బొల్లాపల్లి మండలం వెల్లటూరు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు డిబేట్‌లో రెండోస్థానం, ఆటల పోటీల్లో మూడో స్థానం సాధించారు. విద్యార్థి ఎం.లీలానాయక్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అలీషా, చంద్రజిత్తు యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

అస్తవ్యస్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహణ



శావల్యాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మూలనపడ్డ వైద్యపరీక్షల మిషన్‌లు

- పీహెచ్‌సీకే పరిమితమవుతున్న హెల్త్‌సూపర్‌వైజర్లు
- కనుమరుగైన కమ్యూనిటీ హెల్త్‌సూపర్‌వైజర్లు
- కంప్యూటర్ ఆపరేటర్‌గా సూపర్‌వైజర్లకు విధులు
- నిరుపయోగంగా రూ.లక్షల విలువైన యంత్రాలు
- వైద్యపరీక్షలు లేక రోగులకు ఇక్కట్లు

శావల్యాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ బృందం నిర్వహించిన జాతీయ నాణ్యతహామీ ప్రమాణాల సర్వేలో గుర్తింపును పొంది అందరి మన్ననలు పొందిన శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేడు నిర్వహణ సక్రమంగా లేక అస్తవ్యస్తంగా మారింది. గ్రామాలలో అందిస్తున్న వైద్యసేవలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తల పనితీరును ఎప్పటికప్పుడు తనిఖీచేసి ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా గ్రామాల్లో నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన హెల్త్ సూపర్‌వైజర్‌లు పీహెచ్‌సీల్లోనే కాలం గడుపుతూ గ్రామాల వైపు కన్నెత్తయినా చూడడం లేదు. పీహెచ్‌సీలో విధుల్లో చేరినప్పటి నుంచి కమ్యూనిటీ హెల్త్ సూపర్‌వైజర్ ఇంతవరకు రోగులకు కనిపించిన దాఖలాలే లేవు. పీహెచ్‌సీలో కంప్యూటర్ ఆపరేటర్ లేకపోవడంతో దాన్ని సాకుగా చూపించి నెలకు వేలాది రూపాయలు వేతనాలు పొందుతున్న సూపర్‌వైజర్‌లు కంప్యూటర్ ఆపరేటర్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామాలలో రోగులకు ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయా, లేదా అన్న పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. పీహెచ్‌సీలలో అన్ని రకాల వైద్యపరీక్షలను అందుబాటులోకి తెచ్చి రోగులకు అన్ని వైద్యపరీక్షలు ఉచితంగా చేస్తున్నామని జిల్లా వైద్యాధికారులు చెబుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో అదేమీ జరగడం లేదు. వివిధ ఆరోగ్య సమస్యలతో పీహెచ్‌సీకి వచ్చే రోగులకు ల్యాబ్ పరీక్షలు చేసేందుకు లక్షలాది రూపాయలు ఖర్చుచేసి ప్రభుత్వం అందించిన యంత్ర పరికరాలు మూలనపడి ఏడాది గడుస్తున్నా కనీసం మరమ్మతులు కూడా చేయించకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో రోగులకు ఉచితంగా చేసే వైద్య పరీక్షలు కరువయ్యాయి. కిడ్నీ, లివర్ పరీక్షలు చేసే బయోకెమిస్ట్రీ ఎనలైజర్, రక్తంలో సోడియం, పొటాషియం ప్రమాణాలు తనిఖీచేసే ఎలక్ట్రొలైట్ ఎనలైజర్‌లు మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారాయి. రోగులకు ప్రస్తుతం రక్తకణాలు, హిమోగ్లోబిన్, షుగర్, బీపీ పరీక్షలు, గర్భిణులకందించే వైద్యపరీక్షలు మాత్రమే జరుగుతున్నాయి. ఇటీవల జిల్లా వైద్యశాఖాధికారి పీహెచ్‌సీలో రెండుసార్లు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించినప్పటికీ పీహెచ్‌సీలో నెలకొని ఉన్న సమస్యలను సిబ్బంది కొరత, వైద్యపరీక్షలకు వినియోగించే యంత్రపరికరాలు వినియోగంలో లేవన్న విషయాలు గుర్తించకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు స్పందించి పీహెచ్‌సీలోని సమస్యలు, సిబ్బంది కొరత, పర్యవేక్షణ లోపాలను పరిష్కరించి మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

పరిటాల రవికి ఘన నివాళి


కారంపూడిరోడ్డులోని ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాలకు నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు మక్కెన, కూటమి నాయకులు


శావల్యాపురంలో పరిటాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

వినుకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 20వ వర్ధంతి సందర్భంగా కూటమి నాయకులు శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు మక్కెన మల్లికార్జునరావు పట్టణంలోని కారంపూడిరోడ్డులో ఉన్న ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మక్కెన మాట్లాడుతూ వామపక్ష భావాలు కలిగిన శ్రీరాములు కుమారుడిగా రవీంద్ర విద్యార్థి దశ నుంచి ఉన్నతమైన భావాలతో ఎదిగిన గొప్ప నాయకుడన్నారు. ఎన్టీఆర్ అభ్యుదయ భావాలు నచ్చి ఆయన చేపట్టిన సమ సమాజ నిర్మాణం కోసం టీడీపీలో చేరి అంచెలంచెలుగా ఎదిగారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టి రాయలసీమ, అనంతపురం ప్రాంతాల్లో అణగారిన వర్గాలకు అండగా నిలిచారన్నారు. అనంతరం కార్యకర్తలకు అల్పాహారం పంపిణీచేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రాయల్ నాగశ్రీను, లాయర్ సైదారావు, రామకోటేశ్వరరావు, సౌదాగర్ జాని బాషా, పీవి సురేష్, పెమ్మసాని నాగేశ్వరరావు, గోవందరాజులు, ముత్తినేని గిరి, వాసిరెడ్డి, లింగమూర్తి, హనుమంతరావు, వంకాయలపాటి పేరయ్య, శ్రీనివాసరావు, వాసిరెడ్డి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: మాజీ మంత్రి పరిటాల రవి వర్ధంతిని శావల్యాపురం సెంటర్‌లోని ఎన్టీఆర్, పరిటాల విగ్రహాల వద్ద శుక్రవారం నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎన్టీఆర్, పరిటాల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాగునీటి సంఘాల అధ్యక్షుడు చెరుకూరి రామాంజనేయులు, మాదినేని కొండలరావు మాట్లాడుతూ టీడీపీకి బలమైన నాయకుడిగా రాష్ట్రాభివృద్ధికి, పేదల సంక్షేమమే లక్ష్యంగా పరిటాల ఎంతో కృషి చేశారన్నారు. అనంతపురం జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. టీడీపీ నాయకులు కాకాని వేణు, పత్తిపాటి కోటిలింగం, చిమటా వెంకటనారాయణ పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షుడు హనుమంతరావు

శావల్యాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పశుపోషకులకు తగిన తోడ్పాటునందించే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న పశుఆరోగ్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గోరింట్ల హనుమంతరావు అన్నారు. మండలంలోని కనమర్లపూడి, కారుమంచి గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలను శుక్రవారం నిర్వహించారు. పశువైద్యాధికారులు పాలపర్తి గణేష్‌కుమార్, సోమల గుణధీర్ పాల్గొని కనమర్లపూడిలో 47పశువులు, కారుమంచిలో 55పశువులకు గర్భకోశవ్యాధి పరీక్షలు చేశారు. అనంతరం జీవాలకు నట్టల నివారణ మందులు, పశు పోషకులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. టీడీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు పూరేటి నరసింహారావు, సీనియర్ నేతలు ముక్కపాటి నాగేశ్వరరావు, బోడెపూడి శంకర్, కాసరగడ్డ వెంకటరత్నం, బోడెపూడి వెంకటేశ్వర్లు, యలవర్తి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్లలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ అమీర్ బాషా, ఈపూరు పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ పీ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ శిబిరంలో 1100 గొర్రెలు, మేకలకు, 72 ఎద్దులు, ఆవులు, గేదెలకు 32 దూడలకు నట్టల నివారణ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గర్భకోశ వ్యాధులకు, మూడు పశువులకు చికిత్స చేశారు. 15 సూది పరీక్షలు ఉచితంగా నిర్వహించటం జరిగిందన్నారు. శిబిరంలో పశు వైద్య డాక్టర్లు, పశు పోషకులు, టీడీపీ నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జరపాల గోవిందునాయక్, ఊరిబిండి కొండలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఎన్నెస్పీ ఈఈ కి వినతిపత్రం అందజేస్తున్న జగ్గారావు, ముప్పాళ్ళ గ్రామస్థులు

బ్రిడ్జిని విస్తరించాలని టీడీపీ నాయకుల వినతి

ఈపూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళ నుంచి నర్సరావుపేట వచ్చే ఆర్ అండ్‌బీ రోడ్డులో అద్దంకి బ్రాంచ్ కెనాల్‌పై ఏర్పాటు చేసిన బ్రిడ్జిని విస్తరించాలంటూ టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు ఆధ్వర్యంలో మండలంలోని ముప్పాళ్ళ గ్రామస్థులు శుక్రవారం ఎన్నెస్పీ ఈఈ డీవీ సుబ్బారావు, డీఈ విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈపూరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి పలురకాల పనులపై ఈ రోడ్డు గుండానే వెళ్తుంటారన్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు వెడల్పు ఉన్నప్పటికీ బ్రిడ్జి వద్ద అంత వెడల్పు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అంతేకాకుండా బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందన్నారు. ఎన్నెస్పీ అధికారులను కలిసిన వారిలో విడపలపాటి హనుమయ్య, సూరే వెంకట నర్సయ్య, జాస్తి బుచ్చారావు, తిరుమలశెట్టి బాలయ్య, డీసీ చైర్మన్ వేణుగోపాల్, లింగాశివ, దండే కోటేశ్వరరావు, ఊట్ల పాపారావు, యలవర్తి వీరాంజినేయులు, తదితరులు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి: ఎంఈవో

శావల్యాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయులు సమర్థవంతమైన ప్రణాళికలు రూపొందించాలని మండల విద్యాశాఖాధికారి మద్దిగుంట్ల సాంబశివరావు కోరారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను పాఠశాలలలో చేపట్టవలసిన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై శుక్రవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల సహకారంతో హెచ్‌ఎంలు బడిబయటి పిల్లలను పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచాలన్నారు. విద్యార్థుల అవసరాలకు తగినట్లుగా పాఠశాలల్లో ప్రస్తుతం అందుబాటులో లేని మౌలిక వసతులను గుర్తించాలని, పటిష్టమైన బోధన ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. రిసోర్స్‌పర్సన్ బిళ్ళా రాజారమేష్, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన

నరసరావుపేట రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జేఎన్‌టీయూ క్యాంపస్‌లో శుక్రవారం మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసరావుపేట మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఎం.వి.రమణ మాట్లాడుతూ మాదక దవ్యాలను నియంత్రించడంలో ప్రతి ఒక్కరికి బాధ్యత ఉందన్నారు. విద్యార్థులు వీటిపై మరింత అవగాహన కలిగి ఉండాన్నారు. సదస్సులో మాదక ద్రవ్యాల నుంచి లభించే నష్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుభాషిని, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్‌బాబు, ఎన్ఎస్ఎస్ కార్యక్రమం అధికారి డాక్టర్ జీపీ రాజు, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి నెలా 4వ శనివారం ఎస్సీ ఎస్టీలకు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక: కలెక్టర్

నరసరావుపేట రూరల్, జనవరి 24: ఎస్సీ ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెల నాలుగో శనివారం ఉదయం 10 గంటలకు పల్నాడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు శుక్రవారం వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రత్యేక పరిష్కార వేదికను ఈ నెల 25న నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. షెడ్యూల్ కులాలు తెగల ప్రజలు ప్రత్యేక పరిష్కార వేదికను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కుళాయిల ఏర్పాటుపై విచారణ

ఈపూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళలో ఇంటింటికి తాగునీటి కుళాయిల ఏర్పాటుకు మండల ప్రత్యేకాధికారి రమణారెడ్డి శుక్రవారం విచారణ జరిపారు. గ్రామంలో పదివేలమంది జనాభా ఉన్నప్పటికీ తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్థులు మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు ఆధ్వర్యంలో ముప్పాళ్ల గ్రామస్థులు విన్నవించుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల ప్రత్యేకాధికారి గ్రామాన్ని సందర్శించి తాగునీటి సమస్య గురించి ప్రజలను విచారించారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఎన్నెస్పీ కాలువ నుంచి తాగునీటిని గ్రామంలో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసి సరఫరా చేయాలని గ్రామస్థులు కోరారు.

సూక్ష్మ పోషక ఎరువుల తయారీ కేంద్రంలో ఏవో తనిఖీ


అగ్రిటెక్ ఎరువుల తయారీ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న ఏవో హరి ప్రసాదు

నాదెండ్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరు గ్రామ పరిధిలోని దొండపాడు రూట్‌లోని ధరణి అగ్రిటెక్ సూక్ష్మ పోషక ఎరువుల తయారీ కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి ఏ హరిప్రసాదు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా తయారీ కేంద్రం లైసెన్స్, పరిశ్రమల శాఖ అనుమతి తదితర పత్రాలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి ఏమైనా వ్యత్యాలు ఉన్నాయా? అనే విషయంపై ఆరా తీశారు. కేంద్రంలో ప్యాకింగ్ కోసం నిల్వ ఉంచిన మెటీరియల్‌ను తనిఖీ చేశారు. క్రమం తప్పకుండా నిల్వల నివేదికను జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో అందజేయాలని నిర్వాహకులు కే సురేష్‌కు సూచించారు. ఆయనతో పాటు ఏఈవో జీవన్ నాయక్, సహాయకులు వేణుగోపాల్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి: జిల్లా ఉద్యానశాఖాధికారి రమణారెడ్డి

ఈపూరు, జనవరి (ఆంధ్రజ్యోతి): మిరప పంటలో సస్య రక్షణ చర్యలు చేపట్టడం వలన చీడపీడల నుంచి పైరును కాపాడుకోవచ్చునని జిల్లా ఉద్యానశాఖాధికారి రమణారెడ్డి అన్నారు. మండలంలోని బొమ్మరాజుపల్లి, ముప్పాళ్ళ గ్రామాలలో మిరప పొలాలను సందర్శించారు. మిరపలో నల్లతామర నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రాచకొండ శివగాయత్రి, షేక్ ఉప్పలపాటి సల్మా, ఉద్యానశాఖ సహాయకులు ఏలియా, గాలం యతేంద్ర నాగరాజు, రైతులు పాల్గొన్నారు.


చెరువుకట్టపై నివాసం ఉంటున్న నిరుపేదల వివరాలు సేకరిస్తున్న పల్నాడు జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ (ఏపీసీ) వరద సుబ్బారావు

పేదల దుస్థితిపై అధికారుల పరిశీలన

●పౌష్టికాహార పంపిణీకి, ఆటోలో పాఠశాలకు పంపేందుకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వినుకొండ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటప్పనగర్ సమీపంలోని చెరువు కట్టపై నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబాలను పల్నాడు జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వరదా సుబ్బారావు శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 22వ తేదీన ఆంధ్రజ్యోతిలో వెలువడిన 'బడిని చూడని బాల్యం' కథనంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కుటుంబాలు ఆర్థిక స్థితిగతులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిశీలించినట్లు సుబ్బారావు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా పౌష్టికాహారం లోపంతో ఉన్న చిన్నారులను చూసి సుబ్బారావు చెలించిపోయారు. ఇన్ని రోజులు చెరువుగట్టుపై పడుతున్న ఇబ్బందులు అధికారులు గుర్తించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మొత్తం 40మంది చిన్నారులు ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారికి ఆధార్ కార్డులు, జన్మదిన ధ్రువీకరణ పత్రాలు లేక బడికి, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించలేకపోయామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వెంటనే వారిని ఆధార్‌తో సంబంధం లేకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు 5సంవత్సరాల లోపు ఉన్న పిల్లలను కోటప్పనగర్ అంగన్‌వాడీకేంద్రం ద్వారా పౌష్టికాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఐదు సంవత్సరాలు పైబడిన వారిని పాఠశాలకు వెళ్ళేందుకు ఉచిత ఆటో సర్వీసును ఏర్పాటుచేస్తున్నట్లు స్థానికులకు హామీ ఇవ్వడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. ఆయనతోపాటు పాఠశాల (ఏఎల్ఎస్) కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ శ్రీలత, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధూళిపాళ్ళ వీరయ్యచౌదరికి ఘన నివాళి


వీరయ్య చౌదరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డెయిరీ జడ్ఎంనరేష్‌బాబు

వినుకొండ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సంగం డెయిరీ మాజీ చైర్మన్ ధూళిపాళ్ళ వీరయ్యచౌదరి 31వ వర్ధంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. నరసరావుపేట మిల్క్ సెంటర్‌లో నరసరావుపేట జోనల్ మేనేజర్ కాట్ర నరేష్‌బాబు వీరయ్యచౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగం డెయిరీ చైర్మన్‌గా ఉమ్మడి రాష్ట్ర మంత్రిగా ఎన్నో సేవలు ప్రజలకు అందించారన్నారు. పాల ఉత్పత్తిదారుల శ్రేయస్సే లక్ష్యంగా కృషిచేశారని, సంగం డెయిరీ అభివృద్ధికి, రాష్ట్ర అభివృద్ధిలో వీరయ్యచౌదరి పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో డెయిరీ సిబ్బంది, వెటర్నరీ డాక్టర్లు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసిన ఎమ్మెల్యే అరవిందబాబు


డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఆయన కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. త్రికోటేశ్వర స్వామి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి వినతి పత్రాలను అందించారు. కోటప్పకొండ తిరునాళ్ళ సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లు గురించి చర్చించారు. గతంలో కొత్తపాలెం నుంచి కోటప్పకొండ వరకు వెళ్ళే రహదారికి సుమారుగా రూ.4 కోట్లు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.

స్త్రీలపై కొనసాగుతున్న వివక్ష: సువర్ణకుమారి

యడ్లపాడు, జనవరి 24 (ఆంధ్రజోతి): సమాజంలో స్త్రీలు వివక్షకు గురవుతున్నారని, ఎన్ని చట్టాలు తెచ్చినా వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉందని నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సువర్ణకుమారి అన్నారు. మండలంలోని తిమ్మాపురం, యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ సమానత్వం కోసం మహిళలు ఎన్నో దశాబ్దాలుగా పోరాడుతూనే ఉన్నారని, ప్రజల మనస్సుల్లో మార్పు రానంత వరకు వివక్ష కొనసాగుతూనే ఉంటుందన్నారు. ప్రభుత్వం బాలికల ఉన్నతికోసం ప్రవేశపెట్టిన పథకాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం వివిధ అంశాలలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు విజయభారతి, వెంకటాద్రినాయుడు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. జ్ఞానేశ్వరి అర్బన్, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఏజీపీ దాసరి చిట్టిబాబు మాట్లాడుతూ బాలికలను కాపాడుకోవటం సమాజ బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక ప్రచురించిన ఎదిగే ఆడ పిల్ల ఏమి తెలుసుకోవాలి? అనే పుస్తకాన్ని విద్యార్థినులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన రాష్ట్ర కార్యదర్శి డీ బుచ్చిబాబు, ధూళిపాళ్ళ శ్రీనివాసరావు, గార్ఫ్ ఉపాధ్యక్షుడు యాకోబు, కార్యదర్శి పీ బుల్లిబాబు, ఇన్‌చార్జ్ ప్రత్యేక అధికారి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బాలికల విద్య, హక్కుల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున్, డిప్లొమో ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ ఎ కిశోర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. బాలికల ప్రాముఖ్యతను తెలియజేసే స్ఫూర్తిదాయక నాటకం విద్యార్థినులు ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బకాయిలను విడుదల చేయాలి: యూటీఎఫ్ డిమాండ్

వినుకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వినుకొండ శాఖ కార్యవర్గ సమావేశం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో బి.నాగేశ్వరరావు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిలర్ డీవీ లింగయ్య మాట్లాడుతూ ప్రభుత్వం 12వ పీఆర్‌సీ కమిషన్‌ను ప్రకటించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. 2023 జూలైలో అమలుకావాల్సిన 12వ రివిజన్ కమిషన్‌తోపాటు, కమిటీని నియమించకపోవటంతో ఉద్యోగ ఉపాధ్యాయులు 12వ పీఆర్‌సీని 18నెలల కాలానికి కోల్పోవల్సి వచ్చిందన్నారు. 11వ పీఆర్‌సీకి సంబంధించి, డీఏ, సీపీఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాదికారి రవిబాబు, బీ.రాములనాయక్, కె.శ్రీనివాసరావు, డి.మస్తాన్, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.